తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త



# అర్ధరాత్రి ప్రశాంతంగా గంగమ్మకు శాంతి అభిషేకం

## ఉదయం సున్నపు కుండలు అలంకరణలో అభయం

తిరుపతి,మే 11ప్రభాతవార్త:

తిరుపతి నగరగ్రామదేవత తాతయ్యగుంట గంగమ్మ జాతర వేడుకల్లో సోమవారం అర్ధరాత్రి దాటిన తరువాత అమ్మవారికి జాతరలో అలసిసొలసపడంతో శాంతిఅభిషేకం నిర్వహిం చారు. ప్రతి ఏటా జాతరలో అమ్మవారు రోజుకో అలంకరణలో భక్తులకు దర్శనమివ్వడం పరిపాటి. జాతరలో అలసిన గంగమ్మకు సోమవారం అర్ధరాత్రి మహాశాంతి అభిషేకం జరిపిస్తారు. యధావిధిగా ఆలయ ఛైర్మన్ నైనార్ మహేశ్‌యాదవ్, ఆలయ ఈఓ ఎ.జయకుమార్, అర్చకులు, బోర్డు సభ్యులు పాల్గొని అమ్మవారికి అభిషేకం నిర్వహించారు. ఉదయం తాతయ్యగుంట గంగమ్మ సున్నపుకుండల వేషంలో భక్తులకు అభయమిచ్చారు. పెద్ద గంగమ్మ చిన్న గంగమ్మలకు ప్రతీకలుగా సున్నప్పు కొండల వేషాన్ని ఇద్దరు కైకాల కులస్తులు వేశారు. స్థానికులు వివిధ రకాల వేషాలు వేసుకుని అమ్మవారిని దర్శించుకున్నారు. తిరుపతి నియోజకవర్గ టిడిపి ఇంచార్జ్ మన్నూరు సుగుణమ్మ ,యువ నాయకురాలు బట్టే వెంకట కీర్తి, వారి కుటుంబ సభ్యులు కలిసి సోమవారం తాతయ్యగుంట గంగమ్మ తల్లికి భక్తిశ్రద్ధలతో పట్టు వస్త్రాలు సమర్పించారు.



# తాతయ్యగుంట గంగమ్మ జాతరకు భారీ భద్రత

## -విలువైన నగలు ధరించి రావద్దని పోలీసులు వినతి



తిరుపతి,మే 11ప్రభాతవార్త:

తాతయ్యగుంట గంగమ్మ వారంరోజుల జాతరలో భాగంగా ప్రధానమైన గంగమ్మజాతర నేడు(మంగళవారం).జరగనుంది. ఈ సందర్భంగా భారీగా భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున, అమ్మవారి దర్శనం సాఫీగా, భద్రంగా జరగడానికి భక్తులు పోలీసుల సూచనలు తప్పనిసరిగా పాటించాలని జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు విజ్ఞప్తి చేశారు. పోలీసు శాఖ విజ్ఞప్తి చేసింది. విలువైన వస్తువుల పట్ల అప్రమత్తంగా ఉండాలి. రద్దీ ప్రదేశాల్లో జేబుదొంగలు, చైన్ స్నాచర్లు సంచరించే అవకాశమున్నందున భక్తులు తమ వద్ద ఉన్న బంగారు ఆభరణాలు, నగదు, మొబైల్ ఫోన్లు, ఇతర విలువైన వస్తువుల పట్ల ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలి. వీలైనంత వరకు అధిక విలువైన బంగారు ఆభరణాలు ధరించకుండా రావడం మంచిది. పర్సులు, బ్యాగులు, మొబైల్ ఫోన్లు ఎల్లప్పుడూ తమ కంటికి కనిపించేలా ఉంచుకోవాలి. రద్దీ సమయంలో చిన్నారులు తప్పిపోయే ప్రమాదం ఎక్కువగా ఉండే అవకాశం ఉన్నందున తల్లిదండ్రులు పిల్లల చేతులు ఎట్టి పరిస్థితుల్లోనూ వదలకూడదు. పిల్లల జేబులో ,దుస్తులపై తల్లిదండ్రుల పేరు, ఫోన్ నంబర్, పూర్తి చిరునామా రాసిన గుర్తింపు చీటీ తప్పనిసరిగా ఉంచాలి. ఒకవేళ పిల్లలు తప్పిపోయినట్లయితే భయపడకుండా వెంటనే యూనిఫాంలో ఉన్న పోలీసులను సంప్రదించాలని ముందుగానే వారికి తెలియజేయాలి.

జాతర ప్రాంగణంలో ఎవరైనా అనుమానాస్పదంగా తిరుగుతున్నట్లు గమనించినా ,ఎవరూ లేని బ్యాగులు, అనాథ వస్తువులు కనిపించినా వాటిని తాకకుండా వెంటనే సమీపంలో విధుల్లో ఉన్న పోలీసులకు సమాచారం అందించాలి. అత్యవసర పరిస్థితుల్లో తక్షణ సహాయం కోసం 112 టోల్ ఫ్రీ నంబర్‌కు కాల్ చేయాలని జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు కోరారు.

# చిత్తూరు నడివీధి గంగజాతర ప్రారంభం

## నేటి తెల్లవారుజాము మాజీ ఎమ్మెల్యే సికె బాబు గంగమ్మకు తొలిపూజ

## రేపు ఓంశక్తి భక్తుల విన్యాసాల మధ్య భారీ ఊరేగింపుతో నిమజ్జనం

చిత్తూరు, మే 11 ప్రభాతవార్త:



చిత్తూరు నడివీధి గంగమ్మ, చిత్తూరు గంగజాతరలో ఓంశక్తి భక్తుల విన్యాసాలు(ఫైల్‌ఫోటో)

300 సంవత్సరాలకు పైగా చరిత్ర కల్గిన చిత్తూరు నడివీధి గంగజాతర మంగళ, బుధవారాల్లో చిత్తూరు నగర పరిధిలో అట్టహాసంగా జరుగనుంది. చిత్తూరు బజారు వీధిలో సోమవారం అర్ధరాత్రి ప్రతిష్టించబడి నడివీధి గంగమ్మకు గంగజాతర వంశపారంపర్య ధర్మకర్మ, మాజీ ఎమ్మెల్యే సికె బాబు, ఆయన సతీమణి సికె లావణ్యబాబులు మంగళవారం తెల్లవారుజాము తొలిపూజ చేసి గంగమ్మకు తెర తొలగించి జాతరను ప్రారంభించనున్నారు. అప్పటి నుండి గంగమ్మను దర్శించుకోవడానికి బజారువీధి మొత్తం క్రిక్కిరిసిపోతారు. అమ్మవారిని దర్శించుకోవడానికి వచ్చే భక్తులు గంటల తరబడి క్యూ లైన్లలో నిలబడాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. చిత్తూరు నడివీధి గంగజాతరలో గంగమ్మను దర్శించుకుని తమ మొక్కులు తీర్చుకోవడానికి చిత్తూరు నగర వాసులతో పాటు చిత్తూరు పరిసర ప్రాంతాల్లోని ప్రజలు, ఇతర జిల్లాలు, ఇతర రాష్ట్రాల నుండి పెద్ద ఎత్తున తరలివస్తారు. జాతరకు వారం రోజుల ముందు చాటింపు వేస్తారు. అప్పటి నుండి చిత్తూరులో గంగ జాతర సన్నాహాలు ప్రారంభం అవుతాయి. చాటింపు రోజు చిత్తూరు నగర పరిధిలో వున్న ప్రజలు జాతర జరిగే వరకు రాత్రుల్లో చిత్తూరులోనే నిద్ర చేయాల్సి వుంటుంది. ఎవరైనా బయటి ప్రాంతాలకు వెళ్ళినా వారు రాత్రికల్లా ఇల్లు వచ్చి చేరిపోవాలి. చిత్తూరు బజారు వీధిలో నడివీధి గంగమ్మతో పాటు సంతపేట, గిరింపేట, కొంగారెడ్డిపల్లి, మురకంబట్టు, దొడ్డిపల్లి, ఓబనపల్లి, మంగసముద్రం ప్రాంతాల్లో సైతం గంగమ్మలను ప్రతిష్టించి ఈ రెండు రోజుల పాటు వైభవంగా జాతరను నిర్వహిస్తారు. అమ్మవారికి మంగళవారం ఉదయం భక్తులు అంబలి సమర్పిస్తారు.

మధ్యాహ్నం మాంసాహార నైవేద్యం సమర్పించడం అనాదిగా వస్తోంది. సాయంత్రం అమ్మవారికి నేతి దీపాలతో మహా హారతులు ఇస్తారు. ప్రతి ఏడాది బజారువీధిలోని వర్తకులు గంగమ్మకు కొత్త ఆభరణం సమర్పించడం అనవాయితీగా వస్తోంది. మంగళవారం పెద్ద సంఖ్యలో భక్తులు గంగమ్మను దర్శించుకుని మొక్కుబడులు తీర్చుకుంటారు. బుధవారం తెల్లవారుజాము నుండి సాయంత్రం నాలుగు వరకు గంగమ్మకు ఓ వైపు ప్రత్యేక నైవేద్యాలు జరుగుతుంటే, మరోవైపు పెద్ద సంఖ్యలో గంగమ్మను భక్తులు దర్శించుకుంటుంటారు. సాయంత్రం 4 గంటలకు జాతర వంశపారంపర్య ధర్మకర్త, మాజీ ఎమ్మెల్యే సికె బాబు పొన్నియమ్మన్ గుడి నుండి ఊరేగింపుగా అమ్మవారికి సారె తీసుకెళ్ళి సమర్పిస్తారు. అనంతరం అమ్మవారికి చివరి హారతి ఇచ్చి గంగమ్మను నిమజ్జనానికి తరలిస్తారు. గంగమ్మ నిమజ్జనానికి తరలించే సమయంలో చిత్తూరు నగరంలో ఓంశక్తి భక్తుల విన్యాసాలు ప్రారంభమవుతాయి. ఓం శక్తి భక్తులు గగుర్పొడిచే విన్యాసాలు చేస్తూ గంగమ్మ వద్దకు వెళ్తుండటం చూడటం కోసం పెద్ద ఎత్తున భక్తులు తరలివస్తారు. శరీరాలు, నాలికలకు శూలాలు గ్రుచ్చుకోవడం, చర్మంకు కొక్కి వేసుకుని ఆటోలు, పెద్ద వాహనాలను లాక్కొంటు వెళ్ళడం చేస్తారు. ఈ క్రమంలో హైరోడ్డులోని చందనాబ్రదర్స్ కార్నర్ వద్ద ఓం శక్తి భక్తులు గంగమ్మకు భారీ గజమాల వేస్తారు. అక్కడి నుండి గంగమ్మ కట్టమంచి చెరువులో నిమజ్జనానికి తరలివెళ్తుంది. చిత్తూరులో రెండు రోజుల పాటు జరిగే గంగజాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలీసు యంత్రాంగం పక్కా బందోబస్తును ఏర్పాటు చేసింది.

# సరదా...పేకాట... ప్రాణం బలి తీసుకుంది

## పోలీసుల దాడులతో నీటిలో మునిగి ఒకడు మృతి: మరో ఐదుగురి పరారీ



మృతి చెందిన ఈశ్వర్

**జాతర సందర్భంగా సరదాగా ఆరుమంది కలసి ఆడుతున్న పేకాట చివరకు విషాదం గా మారింది.పేకాట శిబిరం పై ఒక్కసారిగా పోలీసు లు మూకుమ్మడి దాడి తో తప్పించుకునే ప్రయత్నం లో ముగ్గురు వ్యక్తులు పక్కనే ఉన్న నీటి కాలువలో దిగడం తో ఒకడు ఈత రాక ప్రాణాలు కోల్పోయారు.మరో ఐదుగురు పరారయ్యిన సంఘటన నాగలాపురం స్టేషన్ పరిధిలో సోమవారం సాయంత్రం జరిగింది.**

నాగలాపురం, మే 11 ప్రభాతవార్త:

నాగలాపురం మండలం కాలంజేరి గ్రామం సమీపంలో నిత్యం వివిధ ప్రాంతాల నుంచి పేకాటరాయులు చేరుకుని పేకాట ఆడుతున్నారని సమాచారం. గ్రామస్తులు సోమవారం మధ్యాహ్నం 2 గంటలకు నాగలాపురం పోలీసులకు సమాచారం అందజేశారు. సమాచారం అందుకున్న ఎస్ఐ సునీల్ తన సిబ్బందితో కలసి కాలంజేరి గ్రామ సమీపంలోని అరణియార్ రివర్ గట్టుమీద తన సిబ్బందితో కలసి అక్కడికి చేరుకుని తనిఖీ చేశారు. పేకాటరాయులు అక్కడ ఉన్న ద్విచక్రవాహనాలను వదిలివేసి అరణియార్ ఏరు గట్టు వైపు పరుగులు తీశారు. ఈ క్రమంలో నదిలోని నీటి ప్రవాహం ఎక్కువ ఉండడం వలన ఈశ్వర్ అనే వ్యక్తి ప్రమాదవశాత్తు మునిగిపోయారు. ఈ ఘటనలో పుత్తూరుకు చెందిన ఈశ్వర్(55) నీటిలో మునిగి మృతి చెందినట్లు పోలీసులు తెలియజేశారు. అతనితో ఉన్న మరో నలుగురు అక్కడి నుంచి పరారైనట్లు సమాచారం. వారి వివరాలు తెలియాల్సి ఉంది. సంఘటన సమాచారం అందుకున్న పుత్తూరు రూరల్ డీఎస్పీ రవికుమార్, సత్యవేడు సర్కిల్ఇన్‌స్పెక్టర్ మురళీనాయుడు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సత్యవేడు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. దీని మీద విచారణ జరిపి పూర్తి వివరాలు తెలియజేయాలని పోలీసు వారు తెలియజేశారు.

# కూలికి వచ్చాడు వ్యసనంతో కాటికి వెళ్ళాడు



శ్రీకాళహస్తి రూరల్,మే 11 ప్రభాతవార్త

శ్రీకాళహస్తి మండలంలోని ల్యాంకోలో కూలి కోసం తమిళనాడు నుంచి వచ్చాడు. వ్యసనంతో కాటికి వెళ్ళాడు. వివరాల్లోకి వెళితే రూరల్ పోలీసులు అందించిన సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. శ్రీకాళహస్తి మండలంలోని పైప్స్ ఫ్యాక్టరీలో పని చేయటానికి ఇద్దరు స్నేహితులుశ్రీధర్(21), సారది(25)లు వచ్చారు.మృతుడు సారధిది తమిళనాడు రాణీపేట వాలాజాకుచెందిన వ్యక్తి కాగా శ్రీధర్ మధురై జిల్లా తేనికి చెందిన వాడు. ఇరువురు ఫ్యాక్టరీలో పని చేసుకుంటూ రాచగున్నేరి లోని ఓ గదిలో అద్దెకు ఉంటున్నారు. సోమవారం పనులు ముగించుకొని గదికిచేరారు. ఇరువురు స్నేహితులు మద్యం సేవించటానికి బైఠాయించారు. మరి ఏం జరిగిందో ఏమో కానీ శ్రీధర్ స్నేహితుడు సారధిని మద్యం బాటిల్‌తో తలపై బాదాడు. దాంతో ఆతను అక్కడికక్కడే మృతి చెందినట్లు గుర్తించారు.సారధి మొదట పనిలో చేరాడు, వెల్డింగ్ పనులు చేసుకుంటూ తర్వాత శ్రీధర్‌ను చేర్పించాడు. ఆతను సూపర్‌వైజర్ అయ్యాడు.ఈ విషయంల ఇద్దరి మధ్య వివాదం చోటుచేసుకుంది. ఇరువురు గదిలో మద్యం సేవిస్తూ మాటా మాటా పెంచుకున్నారు. దాంతో శ్రీధర్ సారధిపై దాడి చేసాడు. బీర్ బాటిల్‌తో దాడి చేయటంతో సారధి రక్తపుమడుగులో మునిగి పోయాడు. సమాచారం అందటంతో శ్రీకాళహస్తి రూరల్ సిఐ ఇబ్రహీం,ఎస్ఐ వారి సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ ఘర్షణకు కారణాలేమిటో విచారిస్తున్నారు.

# రైలు కిందపడి ఆత్మహత్య...

రేణిగుంట మే 11 ప్రభాతవార్త



రేణిగుంట మండలం కరకంబాడి వద్ద రైల్వే ట్రాక్ పై సుమారు 61 సంవత్సరాల వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన సోమవారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి కరకంబాడి కి చెందిన శివరాజు అమర్ రాజా ఫ్యాక్టరీలో పనిచేస్తూ రిటైర్డ్ అయ్యాడు. దాదాపు పది సంవత్సరాల నుండి భార్యాబిడ్డలకు దూరంగా ఉంటూ ఒంటరితనాన్ని అనుభవిస్తున్నాడు. ఆరోగ్యపరంగా ఇబ్బందులు ఉండడంతో ఒంటరితనాన్ని భరించలేక రేణిగుంట నుండి కడప వైపు వెళ్లే రైల్వే ట్రాక్ పై మామండూరు కరకంబాడి మధ్య రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. రేణిగుంట రైల్వే పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు...

# నిర్ణీత గడువులోపు సమస్యలకు పరిష్కారం

## - కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశం

చిత్తూరు, మే 11 ప్రభాతవార్త:



ప్రజల నుండి సమస్యలపై అందిన అర్జీలను క్షేత్ర స్థాయి లో పరిశీలించి నిర్ణీత గడువులోపు పరిష్కరించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ సుమిత్‌కుమార్ కలెక్టరేట్‌లోని నూతన సమావేశభవనంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి హాజరై ప్రజల నుండి సమస్యలపై అర్జీలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ సుమిత్‌కుమార్‌తో పాటు జాయింట్ కలెక్టర్ ఎ.రాజేంద్రన్, డిఆర్ఓ మోహన్‌కుమార్, చిత్తూరు అర్డీఓ శ్రీనివాసులు, డిప్యూటీ కలెక్టర్ సురేష్, డిపిఎం కృష్ణనాయక్, కలెక్టరేట్ ఎఓ వాసుదేవన్, చిత్తూరు అర్బన్ తహసిల్దారు కులశేఖర్, రూరల్ తహసిల్దారు కళ్యాణిలు హాజరై ప్రజల నుండి సమస్యలపై వినతిపత్రాలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సుమిత్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంను అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోందని, అధికారులు ప్రజల నుండి అందిన అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి నాణ్యమైన పరిష్కారం చూపాలన్నారు. లబ్దిదారుల సంతృప్త స్థాయి పెంచే లక్ష్యంతో గడువులోపు ప్రతి అర్జీని పరిష్కరించాలన్నారు.

# 84 ఏళ్ల తల్లిని వేధిస్తున్న కన్న కూతురు

## జిల్లా కలెక్టర్‌ను ఆశ్రయించిన పండుటాకు

**మానవత్వం మంట కలుస్తుంది. ఆస్తి కోసం కన్న బిడ్డలు ఎంతకైనా తెగిస్తున్నారు. వయస్సు పై బడినపుడు కంటి రెప్పలా కాపాడుకోవాల్సిన కుటుంబ సభ్యులు వేధించటం,చంపుతామంటూ భయపెట్టడం నిత్య కృత్యాలయ్యాయి. కొందరు ఆస్తి లాక్కుని అనాధాశ్రమాల్లో వదలి పెడుతుంటే,మరి కొందరు ఇంటి వద్దనే ఉంచుకున్నా ఆలనా పాలనా చూడకుండా నిర్లక్ష్యం చేస్తున్నారు. మరి కొందరు ఏకంగా చంపేస్తున్నారు. ఇదీ నేటి సమాజంలో చోటు చేసుకున్న పరిస్థితి సోమవారం తిరుపతిజిల్లా కలెక్టర్ గ్రీవెన్స్‌లో పెళ్ళకూరుకు చెందిన కడూరు మునెమ్మ(84) తన దీన గాధను కలెక్టర్‌కు విన్నవించటం గమనించదగ్గ విషయం**



తిరిగి వస్తున్న మునెమ్మ,మనవడు

శ్రీకాళహస్తి,మే 11 ప్రభాతవార్త

శ్రీకాళహస్తి పట్టణానికి 15కిలో మీటర్ల దూరంలో పెళ్ళకూరు మండలం చెన్నప్పనాయుడుపేట గ్రామం ఉంది. ఈ గ్రామానికి చెందిన కడూరు మునెమ్మ సోమవారం జిల్లా కలెక్టర్‌ను కలసింది.ఈ సందర్బంగా తన దీన గాధను కలెక్టర్‌కు విన్నవించింది. కన్న తల్లిని కంటి రెప్పలా కాపాడాల్సింది ఎపో యి ఆమెకున్న కొద్దిపాటి ఆస్తిపై కన్నేసి వేధింపులకు గురు చేస్తున్న ఆమానవీయ ఘటన పలువురిని కలచి వేసింది.మునెమ్మ వేదన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. చెన్న ప్ప నాయుడు పేటకు చెందిన కడూరు మునెమ్మకు ఐదుగురు కుమార్తెలు. తన భర్త మరణానంతరం తనకున్న 5 ఎకరాల పొలాన్ని ఐదుగురు కుమార్తెలకు పంచగా మిగిలిన ఒక ఎకరం తన పోషణ,వైద్యఖర్చులకు కోసం తన పేరు మీద ఉంచుకున్నట్లు వివరించారు. నలుగురు కుమార్తెలు ఆమెను గాలికి వదిలివేయగా చిన్న కుమార్తె రామాయణం జ్యోతి మాత్రమే ఆమెను 30 సంవత్సరాలుగా పోషిస్తున్నట్లు వివరించారు.

**వైద్యం కోసం విక్రయాన్ని అడ్డుకుంటున్న కుమార్తెలు:**



కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదు చేస్తున్న మునెమ్మ

వయస్సు పైబడింది. ఆరోగ్య సమస్యలు వెంటాడుతుంది. మునెమ్మ కు నడము నొప్పి చోటు కోవటంతో డాక్టర్లు ఆపరేషన్ చేయాలని సూచించారు. తన వాటాలోని ఎకరంలో 34 సెంట్ల భూమిని గ తంలోనే అమ్ముకుంది. మిగిలిన 66 సెంట్లును తనను పోషిస్తున్న మనవడు రామాయణం శేఖర్‌కు గిఫ్ట్ డీడ్‌గా 2013లో రాసిచ్చింది. ప్రస్తుతం అత్యవసర వైద్య చికిత్సల నిమిత్తం ఆ పొలాన్ని ఈ ఏడాది ఏప్రిల్ 26న విక్రయించగా సమస్య మొదలైందని వివరించారు.

**చంపేస్తామంటూ బెదిరింపులు:**

మునెమ్మ కుమార్తెలు ఆలం విజయమ్మ, చొక్కాని మల్లీశ్వరిలతో పాటు మనవడు అలం దొరబాబు,స్థానికుడు ఆరూరు సుబ్రమణ్యంతో కలసి వృద్ధురాలిని శారీరక,మానసిక వేధింపులకు గురి చేస్తున్నట్లు రోదించింది. పొలం అమ్మే హక్కు నీకు లేదు. పొలంలోకి వస్తే చంపేస్తామంటూ బెదిరిస్తున్నట్లు మునెమ్మ కలెక్టర్‌కు విన్న వించారు. ముఖ్యంగా ఆరూరు సుబ్రమణ్యం అనే వ్యక్తి తన కులం పేరును అడ్డుపెట్టుకొని చట్టపరంగా తనను ఎవరూ ఏమి చేయలేరని ఎవరికి చెప్పుకున్నా లెక్కలేదంటూ బహిరంగంగా హెచ్చరిస్తున్నట్లు ఆ పండుటాకు కలెక్టర్‌కు మొరబెట్టుకున్నారు. అయితే తల్లిదండ్రులు,సీనియర్ సిటిజన్ల సంక్షేమ చట్టం 2007 ప్రకారం తన ఆస్తిపై తనకు పూర్తి హక్కు ఉందని దానిని అడ్డుకుంటున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని మునెమ్మ కలెక్టర్ వద్ద వేడుకుంది. తన చివరి దశలో ప్రశాంతంగా మందులకు ఇబ్బంది లేకుండా బ్రతికేలా పోలీసు రక్షణ కల్పించాలని విన్నవించింది. వృద్ధురాలి కన్నీటి గాధ విన్న జిల్లా యంత్రాంగం స్పందించి ఎలా చర్యలు తీసుకుంటారో వేచి చూడాలి.

# అర్జీదారుల సమస్యలపై సకాలంలో పరిష్కారం చూపాలి

## జిల్లా కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్..

తిరుపతి కలెక్టరేట్ ,మే 11 ప్రభాతవార్త :



ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పి జి ఆర్ ఎస్) కార్యక్రమంలో వచ్చిన అర్జీలకు నాణ్యమైన పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం ఉదయం జిల్లా కలెక్టరేట్ నందు ఏర్పాటు చేసిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పి జి ఆర్ ఎస్) లో డి.ఆర్.ఓ అర్జీదారులకు గౌరవప్రదంగా కుర్చీ ఏర్పాటుతో, వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారులకు త్రాగునీటి సౌకర్యం, మెడికల్ క్యాంప్, గ్రామాల నుండి వచ్చు అర్జీదారులకు టి సరఫరా తదితర సౌకర్యాలను కల్పించి వారి సమస్యలను సావధానంగా వింటూ అర్జీలు స్వీకరించారు.ఈ సందర్భంగా పీ జి ఆర్ ఎస్ లో వచ్చిన అర్జీలకు నాణ్యమైన పరిష్కారం చూపాలని అర్జీదారుల సమస్యలపై నిరక్ష ్యం వహించరాదని తెలిపారు.

# ప్రతి చెరువుకు సమగ్ర ప్రణాళిక

## ఎక్కువ ఆయకట్టు వున్న చెరువులకు జలధారలో మొదటి ప్రాధాన్యత- కలెక్టర్ సుమిత్‌కుమార్



చిత్తూరు, మే 11 ప్రభాతవార్త:
జిల్లాలోని ప్రతి చెరువుకు సంబంధించి సమగ్ర ప్రణాళిక సిద్ధం చేయాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని నాగార్జున ఐఎఎస్ వీడియో కాన్ఫరెన్స్ హాలు నుండి పలమనేరు నియోజకవర్గానికి చెందిన జలధార పనులపై సంబంధిత అధికారులతో సోమవారం కలెక్టర్ సుమిత్‌కుమార్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ జలధార-నీటి భద్రత కింద చేపడుతున్న పనులతో భూగర్భజల మట్టం పెరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లాలో 3,106 చెరువులు వున్నాయని, ప్రతి చెరువుకు సంబంధించి సమగ్ర నివేదిక సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే ప్రతి మండల పరిధిలో వున్న మైనర్ ఇరిగేషన్ ట్యాంకులను పరిశీలించి వాటికి సంబంధించిన ఫీడర్ కాలువలను పూర్తిగా పునరుద్ధరించారా! లేదా! అనే విషయంపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలన్నారు. గత ఆరు నెలల్లో భూగర్భజలాలు సుమారు 6 మీటర్లు తగ్గిన నేపథ్యంలో రానున్న నెలల్లో వర్షపాతం తక్కువ వుండే అవకాశం వుండటంతో భూగర్భ జలాల స్థాయిని పెంచడానికి జలధార- జలహారతి కార్యక్రమంను వేగవంతం చేయాలన్నారు. ఈ సమావేశంలో డ్వామా పిడి రవికుమార్, ఇరిగేషన్ ఎస్ఇ వెంకటేశ్వరరాజు, గ్రౌండ్ వాటర్ డిడి గోవర్ధన్, ఎంపిడిఓలు, డ్వామా ఎపిడిలు, డ్వామా ఎపిఓలు, ఇరిగేషన్ ఎఇలు, పలమనేరు నియోజకవర్గ మండలాల అధికారులు పాల్గొన్నారు.

## రాతి కార్మికులకు పనులు కల్పించాలని కడ పి.డి.కి వినతి



కుప్పం, మే 11 ప్రభాతవార్త
కుప్పం ప్రాంతంలో ఉన్న రాతి కార్మికులకు పనులు కల్పించాలని వడ్డెర సంఘ నేతలు సోమవారం కడ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్‌కు వినతిపత్రం అందించారు. తాము రాతిపని చేసుకుని తమ కుటుంబాలను పోషించుకుంటున్నామని అయితే ఆరునెలల కాలంగా పనులు నిలిపేయడంతో పాటు రాతి పనులను అధికారులు నిలుపుతున్నారన్నారు. దీంతో తమ కుటుంబాలు అప్పుల బారిన పడుతున్నాయన్నారు. అధికారులు స్పందించి న్యాయం చేయాలని కోరారు. దీనిపై కడ పి.డి. మాట్లాడుతూ సిఎం చంద్రబాబునాయుడు దృష్టికి సమస్యను తీసుకెళ్లి సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార ్యక్రమంలో కడ సభ్యుడు రాజ్‌కుమార్, సంఘ నేతలు రవి, బాలు, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## 47లక్షలతో నూతనంగా సిసిరోడ్డుకు భూమిపూజ



కుప్పం, మే 11 ప్రభాతవార్త
సిఎం చంద్రబాబునాయుడు ఆదేశాలతో మండలంలోని పి.బి.నత్తం పంచాయతీ మార్వాడ గ్రామం నుంచి నూలుకుంట క్రాస్ వరకు 47లక్షలతో నూతన సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులకు టిడిపి మండల అధ్యక్షుడు రాజగోపాల్ భూమిపూజ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల ంలో ప్రజలకు మౌలిక వసతుల కల్పనకు తగు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ప్రజలకు తాగునీరు, రోడ్లు, డ్రైన్లు, వీధి దీపాలు ఏర్పాటుకు తొలి ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. ప్రజలు కూడా తమకు మేలు చేస్తున్న సిఎం చంద్రబాబును మరింత ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో కడ సభ్యుడు రామచంద్ర, కార్పోరేషన్ డైరెక్టర్ శరవణ, పిఎసిఎస్ ఛైర్మన్ కృష్ణమూర్తి, మాజీ ఛైర్మన్ ఎవి రవి,కాణిపాకం బోర్డు మెంబర్ వసంతమ్మ, ఎంపిటిసి శ్రీనివాసులు, నేతలు శివకుమార్, చంద్ర, విభూషణ్, రోహిత్ పాల్గొన్నారు.

## ప్రజల సంపూర్ణ ఆరోగ్యం సిఎం చంద్రబాబు ఆశయం

### - టిడిపి మండల అధ్యక్షుడు రాజగోపాల్



కుప్పం, మే 11 ప్రభాతవార్త
కుప్పం ప్రాంత ప్రజల సంపూర్ణ ఆరోగ్యమే సిఎం చంద్రబాబునాయుడు ఆశయమని టిడిపి మండల అధ్యక్షుడు రాజగోపాల్ పేర్కొన్నారు. సోమవారం మండలంలోని ఉర్ల ఓబనపల్లిలో టాటా సంజీవని ప్రాజెక్టు (డిఐఎన్‌సి) గ్రామసభలో ఆయన మాట్లాడారు. ఈ ప్రాజెక్టు ద్వారా ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందడంతో పాటు వారి ఆరోగ్య రికార్డులు డిజిటల్ రూపంలో ఉంటాయన్నారు. అత్యవసర వేళల్లో ప్రజలకు నిపుణులైన వైద్యులచే వైద్య సేవలు సైతం అందుతాయన్నారు. అన్ని పిహెచ్‌సిల్లోనుఈ ప్రాజెక్టు అమలులో ఉందన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కనీసవేతనాలమండలి సభ్యుడు శరవణ, క్లస్టర్ ఇన్‌చార్జ్ శ్రీనివాసులు, విభూషణ్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల్లో ట్యాంకరుతో మంచినీటి సరఫరా

కుప్పం, మే 11 ప్రభాతవార్త



మండలంలోని చెక్కునత్తం పంచాయతీ అడవిముల కలపల్లి, దోలగుట్ట గ్రామాల్లో ప్రజలకు ట్యాంకరుతో మంచి నీటి సరఫరాను మొదలియార్ కార్పోరేషన్ డైరెక్టర్ చెక్కునత్తం మణి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఎం చంద్రబాబు నాయుడు ఆదేశాలతో ప్రభుత్వవిప్ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్‌ఛైర్మన్ పిఎస్‌మునిరత్నం, పికెఎం ఉడా ఛైర్మన్ డాక్టర్ బిఆర్ సురేష్‌బాబుల సూచనలతో గ్రామాల్లో మంచినీటి సమస్య తలెత్తకుండా తగు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో నేతలు వల్లెప్ప, మునిరత్నం, శ్రీకుమార్, బీరప్ప, వినోద్, రామస్వామి, శరవణ, గిరి, లోకేష్, గణేష్ పాల్గొన్నారు.

## క్షేత్ర స్థాయి పరిశీలించి సమస్యలు పరిష్కారం

### - మున్సిపల్ కమీషనర్ నరసింహప్రసాద్

చిత్తూరుహెల్త్, మే 11 ప్రభాతవార్త:
క్షేత్ర స్థాయిలో సమస్యలను పరిశీలించి సత్వరం పరిష్కరించాలని మున్సిపల్ కమీషనర్ నరసింహప్రసాద్ అధికారులను ఆదేశించారు. మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో సోమవారం కమీషనర్ నరసింహ ప్రసాద్ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంకు హాజరై ప్రజల నుండి సమస్యలపై అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కమీషనర్ మాట్లాడుతూ ప్రజల నుండి అందిన సమస్యను పరిశీలించి నాణ్యతతో పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎసిపి నాగేంద్రతో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సమస్యలపై ప్రజల నుండి మొత్తం 5 సమస్యలు అందగా అందులో ఇంజనీరింగ్ విభాగంకు సంబంధించి 4, టౌన్ ప్లానింగ్ 1 వున్నాయి.

## గృహ గణన వేగవంతం చేయాలి



శాంతిపురం, మే 11 ప్రభాతవార్త
మండలంలో చేపడుతున్న గృహ గణన కార్యక్రమంను వేగవంతం చేయాలని ఎంపిడిఓ ఎపిఆర్ కుమార్ కోరారు. సోమవారం గుండిశెట్టిపల్లిలో ఆయన ఇళ్ల గణన సేకరణ కార్యక్రమంను పరిశీలించారు. మండలంలో మొత్తం 18039గృహాలు ఉన్నాయని ప్రతి గృహంకు అధికారులు వస్తారన్నారు. గృహ సమాచారం అనగా తాగునీరు, గ్యాస్, టివి, మరుగుదొడ్లు తదితర వివరాలు సేకరిస్తారన్నారు. మండలంలో 139 బ్లాకులకు 139మంది ఎన్యుమరేటర్లు, 18మంది సూపర్‌వైజర్లు పని చేస్తున్నారన్నారు. ప్రజలు ఇళ్ల గణనకు సహకరించాలని కోరారు.

## పోలీసులచే ఇసుక టిప్పర్ సీజ్



రామకుప్పం, మే 11 ప్రభాతవార్త
మండలంలోని సింగసము ద్రం అటవీ ప్రాంతం నుంచి కుప్పం వైపు వస్తున్న అక్రమంగా ఇసుకను తరలిస్తున్న టిప్పర్‌ను సీజ్ చేసినట్లు ఎస్సై వెంకటమోహన్ తెలిపారు. వాహనం, ఇసుకను సీజ్ చేసి మైనింగ్ అధికారులకు అప్పగించామన్నారు. మండలంలో ఎవరైనా ఇసుక, గ్రానైట్ అక్రమ రవాణాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే సామాజిక మాధ్యమాల్లో ఎవరైనా మత విద్వేషాలు రెచ్చగొట్టేలా పోస్టులు పెడితే చర్యలు తప్పవని పేర్కొన్నారు. ఈ విషయంగా సోషియల్ మీడియాపై నిరంతర పర్యవేక్షణ ఉందన్నారు.

# పిజిఆర్‌ఎస్‌లో పరిష్కారం కానీ సమస్యలు

## జిల్లాస్థాయి అధికారుల ఆదేశాలు కిందిస్థాయి అధికారుల బేఖాతరు




రైల్వే కోడూరు, మే 11, ప్రభాతవార్త
కలెక్టర్, ఎస్పీల కృషిని నీరు కారుస్తున్న మండల స్థాయి అధికారులు. ప్రజా సమస్యలు పరిష్కరించకుండానే పై స్థాయి అధికారుల ఆదేశాలు మండల స్థాయి అధికారులు సమస్య పరిష్కారం కాకుండానే ముగింపు నివేదికలు ఇవ్వడం ఆశ్చర్యకరం. రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రతి సోమవారం మండల స్థాయి మొదలుకొని జిల్లా స్థాయి అధికారుల వరకు గ్రీవెన్స్ సెల్‌ను పకడ్బందీగా నిర్వహించడం జరుగుతుంది. దీనితో కూటమి ప్రభుత్వం కు కింది స్థాయి అధికారులు చేటు తెచ్చి పెడుతున్నారు.ఇదే తరహాలోనే తిరుపతి జిల్లా రైల్వే కోడూరు నియోజకవర్గంలో అనేక మండలాలకు చెందిన ప్రజా సమస్యలు ఇప్పటికీ మూడు జిల్లాలు మారిన మూటకట్టే ఉంచడం విశేషం. అయితే తిరుపతి జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ ఆర్డీవోలు ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రతివారం చూపే కృషి బాగా ఉంది. అయితే వారానికి వారానికి సమస్యలను పరిష్కరించి తగ్గుముఖం పట్టించాల్సి ంది పోయి మండల స్థాయిలో అధికారులు క్షేత్రస్థాయిలో ఉన్న సమస్యలను మరింతగా పెంపొందిస్తున్నారు. రైల్వే కోడూరు నియోజకవర్గంలోని అన్ని మండలాలలో భూ సమస్యలు భూ వివాదాలు అధికంగా ఉన్నాయి. వీటిపట్ల అప్పట్లో కడప, నిన్నటి అన్నమయ్య, నేడు తిరుపతి జిల్లాలో వచ్చిన సమస్యలు ఏ మాత్రం పరిష్కరించబడలేదు. ఫిర్యాదును తక్షణం పరిష్కరించి వాటిని విముక్తి చెందించేందుకు జిల్లా స్థాయి అధికారులు కిందిస్థాయి అధికారులకు కఠినమైన ఆదేశాలనే ఇస్తూ పి జి ఆర్ ఎస్ లో వచ్చిన ఫిర్యాదులను పంపడం జరుగుతుంది. ఈ ఫిర్యాదుల కాలం 15 రోజుల్లో ముగించాల్సి ఉండగా మూడున్నర నెలల పాటుగా సమయాన్ని వెచ్చించి జిల్లాస్థాయి అధికారులు మండల స్థాయి అధికారులకు నివేదికలు వేయడం జరుగుతుంది. అయినప్పటికీ మండల స్థాయి అధికారులు ఏమాత్రం జిల్లాస్థాయి అధికారుల ఆదేశాలను ఖాతరు చేసిన దాఖలాలు లేవు. ఇలా అనుకోవడానికి మళ్లీ మళ్లీ వస్తున్న ఫిర్యాదులే కారణం. పరిష్కరించకపోవడం కాకుండా అటు రెవెన్యూ అధికారులు ఇటు పోలీసు శాఖ అధికారులు కార్యాలయాలకు పరిమితమై అక్కడే పంచాయతీలు చేస్తూ క్షేత్రస్థాయిలో పరిశీలన లేకపోవడంతో సమస్యలు తిష్ట వేసి కూర్చున్నాయని చెప్పవచ్చు. ఈ అధికారులు పై స్థాయి అధికారులను మెప్పించేందుకు సమస్యల కోసం పి జి ఆర్ ఎస్ లో ఫిర్యాదులు చేసిన బాధితులను చివరి సమయంలో కార్యాలయాలకు పిలిపించడం వారికి తెలియకుండానే అధికారి మాట్లాడుతూ సిబ్బందితో ఫోటోలు తీయించి సమస్యను పరిష్కరించామని నివేదికలను జిల్లా స్థాయి అధికారులకు పంపి వారి కల్లే కప్పుతున్నారంటే వీరిలో ఎంత చాకచక్యం ఉందో ప్రజలే ఆశ్చర్యపోతున్నారు. అనేకమార్లు సమస్యలు పరిష్కరించబడ్డాయి అన్న సమాచారం తెలుసుకుని రైతులు అవాక్కైపోవడమే కాకుండా మా సమస్య ఎక్కడ తీరింది ఎవరు తీర్చారని నెపంతో తిరిగి వాటిని రిపీట్ చేసుకోవడం జరుగుతుంది. అధికారులు సమస్య పరిష్కరించడం దేవుడి ఎరుగు ఫిర్యాదు చేసిన అర్జీదారుడు కి అతని ప్రత్యర్థికి మధ్య విభేదాలు పెట్టి వారి మధ్య తీవ్ర స్థాయిలో గొడవలకు కూడా దారి తీసే విధంగా మండల స్థాయి అధికారుల పరిస్థితి ఉంది. వీరి పరిస్థితి చూసే జిల్లాస్థాయి అధికారులకు ఫిర్యాదు చేస్తే వారు వీరికి పంపితే వీరు పరిష్కరించడం పోయి వీరు అక్కడికి వెళ్లారు మీ సమస్యలు కలెక్టర్ ఎస్పీలను అడిగి తీర్చుకోండి అని వారి అర్జీలను బాధితుల ముఖాన విసిరేసి వారిపైన ఆగ్రహించడం కింద స్థాయి అధికారుల తీరు. వీటి పట్ల జిల్లా స్థాయి అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టి పదే పదే వస్తున్న ఫిర్యాదుల పట్ల పరిష్కార మార్గం చూపి వారి మధ్య విభేదాలు ఘర్షణలకు చోటు లేకుండా చూడాలని పిజిఆర్‌ఎస్కు వచ్చిన బాధితులు కోరుకుంటున్నారు.

## పార్కింగ్‌లా మారిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

పూతలపట్టు, మే 11, ప్రభాతవార్త
ప్రభుత్వ ఆరోగ్య అధికారులు పర్యవేక్షణ లోపం కారణంగా పూతలపట్టు మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని వైద్య అధికారులు పార్కింగ్‌లా ఉపయోగిస్తున్నారని, అత్యవసర పరిస్థితిలో అంబులెన్సుకు దారి లేకుండా వాహనాలు హాస్పిటల్ ముందర పెడుతున్నారని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అనేక ఇబ్బంధులు పడుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంకి రోజుకి వందల సంఖ్యలో చికిత్స నిమిత్తము వస్తుంటారు వాహనాలని ఉంచడానికి స్థలం లేక హాస్పిటల్ బయట పెట్టాల్సి ఉందని స్థానికులు చెబుతున్నారు. అధికారులు ఎందుకు హాస్పిటల్ లోపల వాహనాలను ఉంచుతున్నారని హాస్పిటల్ వచ్చేవారు వాహనాలు ఎక్కడ ఉంచడం వలన హాస్పిటల్‌లో వెళ్ళడానికి వీలు లేకుండా వాహనాలను పెడుతున్నారు. అధికారులు పర్యవేక్షణ కరువైనందున ప్రాథమిక ఆరోగ్య అధికారులు వాహనాలు లోపల ఉంచుతున్నారని చెపుతున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.




# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు పలమనేరు, కుప్పం.

## పోలీసు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 39 సమస్యలు



చిత్తూరుహెల్త్, మే 11 ప్రభాతవార్త:
ప్రజా సమస్యలను పరిష్కరించడానికి ఎస్పీ తుషార్ డూడి సోమవారం చిత్తూరు పాత జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన పోలీసు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు జిల్లా నలుమూలల వున్న ప్రజల నుండి 39 సమస్యలపై అర్జీలు అందాయి. ఈ అర్జీలను పరిశీలించిన ఎస్పీ తుషార్ డూడి క్షేత్ర స్థాయిలో వీటిని పక్కాగా పరిశీలించి సత్వరం పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని సంబంధిత పోలీసు అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ తుషార్ డూడితో పాటు ఎఎస్పీ రాజశేఖర్‌రాజు, చిత్తూరు డిఎస్పీ వెంకట నారాయణలు హాజరై ప్రజల నుండి సమస్యలపై అర్జీలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో అత్యధికంగా భూతగాదాలపై 13 ఫిర్యాదులు అందాయి. అలాగే కుటుంబ తగాదాలు 6, ఆస్తి తగాదాలు 6, చీటింగ్ 3, వేధింపులు 2, డబ్బు తగాదాలు 5, చిన్న గొడవలు 1, పోలీసు సేవలపై 3 ఫిర్యాదులు అందాయి.

## ప్రభుత్వ పథకాలపై ప్రజల్లో అవగాహన పెరగాలి

### - కడ పి.డి. వికాస్ మర్మత్



కుప్పం, మే 11 ప్రభాతవార్త
రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రభుత్వ పథకాలపై ప్రజల్లో మరింత అవగాహన పెరగాలని ఇందుకు అధికారులు కృషి చేయాలని కడ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్ ఆదేశించారు. సోమవారం మండల కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్‌ఎస్) కార్యక్రమంను ఆయన నిర్వహించారు. ప్రజలనుంచి వివిధ సమస్యలపై వినతులను స్వీకరించి వాటి పరిష్కారంకు అధికారులకు తగు ఆదేశాలిచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం వివిధ పథకాలు, సంక్షేమ కార్యక్రమాల్లో ఆయా శాఖల పరిధిలో ఐవిఆర్‌ఎస్ కాల్స్ నిర్వహిస్తూ ప్రజల అభిప్రాయం తీసుకుంటోందన్నారు. ఈ విషయంలో ప్రజలనుంచి అధికార యంత్రాంగంకు మంచి స్పందన లభించాల్సి ఉందన్నారు. ప్రజలకు ఆయా పథకాలపై అవగాహన మరింత పెంచాలని ఆదేశించారు. అధికారులు కూడా ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష ్కరించేందుకు చొరవ చూపాలని ఆదేశించారు. ఇందులో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదన్నారు. అన్ని శాఖల అధికారులు పనితీరు మెరుగుపరచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎపిడి శ్రీనివాసులు రాజు, తహశీల్దార్ చిట్టిబాబు, ఎంపిడిఓ వెంకటేశ్వర్లు, డిఇలు పురుషోత్తం, గురవారెడ్డి, ప్రభాకర్, ఎఫ్ఆర్వో జయశంకర్, ఎపిఎం చంద్రశేఖర్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## సర్పంచ్‌ల సేవలు ప్రశంసనీయం

### - జిల్లా వైకాపా ప్రధాన కార్యదర్శి ఎం.దయాసాగర్‌రెడ్డి

పెనుమూరు, మే 11 ప్రభాతవార్త:
గ్రామ పంచాయతీల్లో సర్పంచ్‌లు పలు అభివృద్ధి పనులు చేపట్టి ప్రజల మన్ననలు పొందారని జిల్లా వైకాపా ప్రధాన కార్యదర్శి మహాసముద్రం దయాసాగర్‌రెడ్డి పేర్కొన్నారు. పులిగుండు ఆవరణలో సోమవారం సర్పంచ్ పదవికాలం ముగిసిన పలువురు సర్పంచ్‌లు, వైకాపా నాయకులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి హాజరైన జిల్లా వైకాపా ప్రధాన కార్యదర్శి మహాసముద్రం దయాసాగర్‌రెడ్డి మాట్లాడుతూ గత ఐదేళ్ళ కాలంలో సర్పంచ్‌లు బాధ్యతతో గ్రామాల్లో మౌళిక వసతుల కల్పనకు కృషి చేశారన్నారు. కొంత మంది సర్పంచ్‌లు గ్రామాలను అభివృద్ధి చేయడానికి తమ సొంత నిధులను సైతం ఖర్చు చేశారన్నారు. అనంతరం పలువురు సర్పంచ్‌లను ఆయన శాలువ కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల సీనియర్ వైకాపా నాయకులు మహాసముద్రం సురేష్‌రెడ్డి, మండల వైకాపా కన్వీనర్ కామసాని విజయకుమార్‌రెడ్డి, వైకాపా నాయకులు గోవిందరెడ్డి, కృష్ణారెడ్డి, ఎన్.నరసింహారెడ్డి, గంథంముని, దూది వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## బాబులమ్మ మృతి బాధాకరం: రామిరెడ్డి ధ్వజారెడ్డి

రైల్వేకోడూరు రూరల్, మే 11( ప్రభాతవార్త



రైల్వేకోడూరు పట్టణంలోని పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ విభాగంలో పనిచేస్తూ పదవి విరమణ అయిన మస్తాన్ తల్లి బాబులమ్మ మృతి బాధాకరమని రైల్వే కోడూరు వైసీపీ సీనియర్ నేత మండల ఉపాధ్యక్షులు రామిరెడ్డి ధ్వజ రెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని న్యూ కృష్ణానగర్లో బాబులమ్మ మృతదేహానికి సంతాపాన్ని తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరితో సక్యతగా కలిసిమెలిసి అందరితోనూ సంతోషంగా గడిపే బాబులమ్మ ఉన్నఫలంగా మృతి చెందడం బాధాకర విషయం అని ఆయన ఆవేదన చెందారు. ఈయనతో పాటు ఉపసర్పంచ్ తోట శివ సాయి, యాదవ సంఘం నాయకుడు కొరెడ్డి సిద్దయ్య, ఎక్స్ ఎంపీటీసీ ఆనంద్, మాజీ సర్పంచులు దార్ల చంద్రశేఖర్, హరికృష్ణ రెడ్డి,రౌవుఫ్, మహేశ్వర్ రెడ్డి, కృష్ణారెడ్డి, రమణారెడ్డి, అనంతరాజుపేట మైనార్టీ నాయకులు షేక్ షఫీ, బత్తల సుబ్రహ్మణ్యం, మనీ,శివాజీ తదితరులు పాల్గొన్నారు.

## మత విద్వేషాలు రెచ్చగొట్టేలా పోస్టులు పెట్టొద్దు

వి.కోట, మే 11 ప్రభాతవార్త
సామాజిక మాధ్యమాల్లో మత విద్వేషాలు రెచ్చగొట్టేలా ఎవరూ పోస్టులు పెట్టరాదని సిఐ సోమశేఖర్‌రెడ్డి హెచ్చరించారు. అలాంటి పోస్టులు రీ పోస్టు చేసినా వారిపై కఠిన చర్యలు ఉంటాయన్నారు. చిత్తూరు పోలీసు హెడ్ క్వార్టర్స్‌లో సోషియల్ మీడియాకు సంబంధించి పోలీసుల అధ్వర్యంలో నిఘా ఉంచారన్నారు.

# ప్రభుత్వ భూములు ఆక్రమించే వారిపై చర్యలు : ఎమ్మెల్యే



వినతి పత్రాలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ

వెంకటగిరి, మే 11 ప్రభాతవార్త: పట్టణంలోని ప్రభుత్వ భూములు ఆక్రమించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ హెచ్చరించారు. వెంకటగిరి మున్సిపల్ కార్యాలయంలో ఎమ్మెల్యే అధ్యక్షతన ప్రజా విజ్ఞప్తుల దినాన్ని నిర్వహించారు. ప్రభుత్వ భూముల్లో అక్రమ కట్టడాలు నిర్మించిన వాటిని తొలగిస్తామని తెలిపారు. గత పాలకులు ప్రభుత్వ కళాశాల స్థలాలను విక్రయిస్తే ఆ స్థలాల్లో కట్టడాలు తెలగ లేకుండా తానే ఆపివేయించినట్లు తెలిపారు. ప్రభుత్వ స్థలాలు ఆక్రమించే వారిపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కూడా చెప్పానని తెలిపారు. జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల స్థలాన్ని కొందరు ఆక్రమిస్తుంటే ఆ విషయం తన దృష్టికి రాగా ఆపి వేయించినట్లు తెలిపారు. ప్రభుత్వ స్థలాలు ఆక్రమిస్తే ఎంతటి వారిపై నైనా చర్యలు తీసుకుంటామన్నారు. సమస్యలపై ఇచ్చిన ఫిర్యాదులను పరిశీలించి పరిష్కరిస్తామన్నారు. ప్రభుత్వ స్థలాలను ఆక్రమిస్తున్నట్లు ప్రభుత్వ స్థలాల పరిరక్షణ కమిటీ వారు ఎమ్మెల్యేకి ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ స్థలాలను బోగస్పత్రాలతో ఆక్రమిస్తున్నట్లు తెలిపారు. ఎన్జీవో కాలనీలో కరెంటు సక్రమంగా రావడంలేదని స్థానికులు ఫిర్యాదు చేశారు. ఇంకా అనేక సమస్యలపై ఎమ్మెల్యేలకి ఫిర్యాదులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ విశ్వనాథం, మాజీ ఏఎంసీ చైర్మన్ రాజేశ్వరరావు, పట్టణ పార్టీ అధ్యక్షులు సత్యనారాయణ, పద్మశాలి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ గంగాధర్, తాసిల్దార్ పి శిరీష, ఎంపీడీవో గుణశేఖర్ రెడ్డి, ఏడిఏ అనసూయ, కమిషనర్ ఈగ కిరణ్, ఏవో సుజాత, నీటిపారుదల శాఖ ఏఈలు బాబురావు, భూపతి బాబు, పశుసంవర్ధక శాఖ ఏడి శ్రీహరి, సిడిపిఓ శంషాద్ బేగం తదితరులు పాల్గొన్నారు. ఫోటో

**భూముల కబ్జాపై సిఐడి విచారణ జరిపించాలి**
**- పరిరక్షణ కమిటీ చైర్మన్ బికే ప్రసాద్**

పట్టణంలోని కోట్లాది రూపాయల విలువ చేసే ప్రభుత్వ భూములను భూకబ్జాదారులు తప్పుడు పత్రాలతో కబ్జా చేసే ప్రయత్నాల్లో ఉన్నందున వీటిని అడ్డుకోవాలంటే రాష్ట్ర ప్రభుత్వం సిఐడి విచారణ జరిపించి భూమాఫియాపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ కమిటీ చైర్మన్ బికే ప్రసాద్ కోరారు. మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి ప్రజా దర్బార్‌లో పాల్గొన్న శాసనసభ్యులు కురుగొండ్ల రామకృష్ణకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ ఆఫీసుతో పాటు సాంఘిక సంక్షేమ హాస్టల్, గతంలో ఇక్కడ ఉన్న సమితి భవనాల స్థలాలన్నీ కూడా 1965కి పూర్వం ప్రభుత్వం కొనుగోలు చేసి సమితి కార్యాలయం, ఉద్యోగుల నివాస గృహాల నిర్మాణం చేపట్టిందన్నారు. 1993, 1994,1995, 2002 సర్వే నంబర్లలోని ఆరు



మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ కమిటీ నాయకులు

ఎకరాల 61 సెంట్ల భూమిని ప్రభుత్వం సేకరించగా మున్సిపల్ కార్యాలయం, హాస్టల్‌కి పోను మిగిలి ఉన్న 3 ఎకరాల స్థలాన్ని షేక్‌అబ్దుల్ కరీం సాహెబ్, దంపెళ్ళ వెంకట సుబ్బయ్యల వారసు లంటూ కొద్ది మందిని పేర్కొని దొంగ రికార్డుని తయారు చేసి కొట్టేసే ప్రయత్న ంలో ఉన్నారని అన్నారు. 1974 ఏప్రిల్ 22న వెంకటగిరి రాజాల నుంచి 18 ఎకరాలు ఆనాటి విశ్వోదయ కళాశాల యాజమాన్యం కొనుగోలు చేసిందన్నారు. కళాశాల స్థలానికి ఉత్తరపు హద్దులో అనాధీనంగా పేర్కొన్నారని, 1977లో ప్రభుత్వానికి బదిలీ చేసినప్పుడు వ్రాసుకున్న ఒప్పంద పత్రంలో కూడా పోరంబోకు భూమిగా పేర్కొన్నారని వివరించారు. 1992 లోను, 2000 సంవత్సరంలో లోను సమితి స్థలంతో కలిపి విశ్వోదయ కళాశాల అనుభవంలో ఉన్నట్లుగా లేఔట్ వేసారని అన్ని విధాలుగా ప్రభుత్వ భూమిగా నమోదయినప్పుడు ప్రైవేట్ వ్యక్తులకు హక్కులు ఎలా వస్తాయని ప్రశ్నించారు. దీంతో పాటు జిల్లా పరిషత్ హై స్కూల్ గ్రౌండ్ 5 ఎకరాల 29 సెంట్లకు కూడా తప్పుడు పత్రాలు సృష్టించారని చెప్పారు. పెరియవరం గ్రామం 1099 సర్వే నంబర్‌లోని 3 ఎకరాల స్థలం గతంలో రైతు బజార్ కోసం గుర్తించారని దీనిపైన తప్పుడు రిజిస్ట్రేషన్లు జరిగి ఉన్నాయని ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. అమ్మవారిపేట గ్రామం 215 సర్వే నెంబర్‌లోని 36 ఎకరాల చెరువు ఆక్రమణలకు గురికాకుండా చుట్టూ ట్యాంక్ బండ్ నిర్మించాలని, చెట్లు నాటి రక్షించాలని కోరారు. దీనిపై ఎమ్మెల్యే స్పందిస్తూ ప్రభుత్వ భూములను ఆక్రమణకు గురికాకుండా చూస్తానని, అమ్మవారిపేట చెరువులో ఉన్న అక్రమ కట్టడాలను కూడా గుర్తించి మున్సిపల్ అధికారుల ద్వారా తొలగిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ప్రిన్సిపాల్ వివి రమణారెడ్డి, ఏపిటిఎఫ్ సీనియర్ నాయకులు పి.గౌస్ బాషా, రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్షుడు ఆర్. సుబ్బరాయుడు, జిల్లా నాయకులు జీ కృష్ణారెడ్డి, వివి రమణయ్య, సిపిఐ నాయకులు నరసింహులు, బీఎస్పీ నాయకులు కె.రాజేష్, ప్రజాతంత్ర చేనేత కార్మిక సంఘం అధ్యక్షులు సిహెచ్ చిన ఓబయ్య, పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

# శ్రీ తిరుపతి గంగమ్మ జాతరను కలసికట్టుగా నిర్వహిద్దాం

**-20న సిఎం దంపతులచే అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పణ - ప్రభుత్వ విప్ డాక్టర్ కంచర్ల**




కుప్పం, మే 11 ప్రభాతవార్త: కుప్పం గ్రామదేవత, జిల్లాలో ప్రసిద్ధి చెందిన శ్రీ తిరుపతి గంగమ్మ జాతరను అధికారులు, నాయకులు కలసికట్టుగా పనిచేసి విజయవంతం చేద్దామని ప్రభుత్వవిప్, కడ పిఎసి ఛైర్మన్ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ పేర్కొన్నారు. సోమవారం కడ కార్యాలయంలో ప్రభుత్వవిప్, కడ పిఎసి ఛైర్మన్ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్, కడ పి.డి. వికాస్ మర్మత్, ఆలయ ఛైర్మన్ బిఎంకె రవిచంద్రబాబు, ఎపిడి శ్రీనివాసులు రాజు, ఆర్డీఓ విజయలక్ష్మి, డిఎస్పీ పార్థసారథి, కమీషనర్ శ్రీనివాసరావు,రూరల్ సిఐ మల్లేష్ యాదవ్, వివిధ శాఖల అధికారులు, నేతలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వవిప్ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ మాట్లాడుతూ జాతరకు ఆంధ్ర, కర్ణాటక,తమిళనాడు రాష్ట్రాలనుంచి భక్తులు లక్షల సంఖ్యలో వస్తారని భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తగు చర్యలు తీసుకోవాలని అధికారులను సూచించారు. అలాగే ప్రభుత్వ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాల న్నారు. ఈనెల 20న సిఎం చంద్రబాబునాయుడు దంపతులు అమ్మవారికి పట్టువస్త్రాల సమర్పణకు విచ్చేస్తారన్నారు. భక్తులకు మంచినీరు, మజ్జిగ పంపిణీకి చర్యలు చేపట్టాలన్నారు. కడ పి.డి. వికాస్ మర్మత్ మాట్లాడుతూ భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా బ్యారికేడింగ్, వాహనాల పార్కింగ్ వసతిని పోలీసుశాఖ కల్పించాలన్నారు. అలాగే అమ్మవారి శిరస్సు ఊరేగింపుకు ఇబ్బంది లేకుండా విద్యుత్ తీగలు, కేబుల్ వైర్లు మరింత ఎత్తులో ఉండేలా చూడాలని రెస్కో అధికారులను ఆదేశించారు. అలాగే పారిశుద్ధ్య పనులను మున్సిపాలిటీ, మండల పరిషత్ అధికారులు పర్యవేక్షించాలన్నారు. ఆలయ ఛైర్మన్ బిఎంకె రవిచంద్రబాబు మాట్లాడుతూ ఈనెల 18,19,20 తేదీల్లో జాతర ముఖ్య ఘట్టాలు అని ఆ రోజు పోలీసు భద్రత పటిష్టంగా ఉంచాలని కోరారు. జాతరకు వచ్చే భక్తులకు ఎటువంటి లోటు లేకుండా అధికారులు సహకరించాలని కోరారు. డిఎస్పీ పార్థసారథి మాట్లాడుతూ జంతుబలులు చేసే వారికి ఐడి కార్డులు ఇస్తామని, సిఎం పర్యటన నేపథ్యంలో పటిష్ట బందోబస్తు చర్యలు తీసుకుంటా మన్నారు. అనంతరం వివిధ అంశాలపై చర్చించారు. సమావేశంలో టిటిడి బోర్డు సభ్యుడు వైద్యం శాంతారాం, ఎపిఐఐసి డైరెక్టర్ ప్రేమ్‌కుమార్, రెస్కోఛైర్మన్ ప్రతాప్, ఎఎంసి ఛైర్మన్ జిఎం రాజు, కడ సభ్యులు రాజ్‌కుమార్, రామచంద్ర, సుగుణమ్మ, సతీష్, ఏరియా ఆస్పత్రి వైస్‌ఛైర్మన్ భాగ్యలక్ష్మి త్రిలోక్, మండల పార్టీ అధ్యక్షులు రాజగోపాల్, కాణిపాకం వెంకటేష్, సుబ్బు, జనసేన ఇన్‌చార్జ్ నరేష్, బిజెపి ఇన్‌చార్జ్ తులసినాథ్, స్థానిక నేతలు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

## రాజన్న ఫౌండేషకి...జాతీయస్థాయి అవార్డు




రేణిగుంట, మే 11 ప్రభాతవార్త: రాజన్న ఫౌండేషన్ కు విద్య నైపుణ్యాభివృద్ధి రంగాల్లో విశిష్ట సేవలు అందిస్తున్నందుకు జాతీయస్థాయి బెస్ట్ రూరల్ డెవలప్మెంట్ ఇన్సియేటివ్ ఆఫ్ ద ఇయర్ 2026 అవార్డు లభించింది. ఈ అవార్డును ఢిల్లీ నందు నిర్వహి ంచిన గ్లోబల్ సి ఎస్ ఆర్, ఎస్సిజి సమ్మిట్ అవార్డ్స్ 2026 నందు మార్కెటింగ్ బ్రాండ్ హనోక్స్ సంస్థ ద్వారా రాజన్న ఫౌండేషన్ ప్రతినిధులు అందుకున్నారు. పోలీస్ రిటైర్డ్ అసిస్టెంట్ కమిషనర్ ప్రముఖ సేవా తత్పరుడు వేద భూషణ్ సమక్షంలో అవార్డును రాజన్న ఫౌండేషన్ హెడ్ సతీష్ రాళ్లపల్లి తీసుకున్నారు. ఈ సందర్భంగా రాజన్న ఫౌండేషన్ వ్యవస్థాపకులు గల్లా రామచంద్ర నాయుడు మాట్లాడుతూ గ్రామీణ యువతకు విద్య, నైపుణ్యాలు, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించి వారి జీవితాలు స్థిరమైన మార్పు తీసుకురావడమే రాజన్న ఫౌండేషన్ ముఖ్య ఉద్దేశం అన్నారు. కార్యక్రమంలో అమర రాజా గ్రూప్ చైర్మన్ గల్లా జయదేవ్, పాల్గొన్నారు...

## తాతయ్యగుంట గంగమ్మకు సారె

**శక్తి పీఠాధీశ్వరీ రమ్యానంద భారతీ సారె**



తిరుపతి,మే 11ప్రభాతవార్త: సనాతన ధర్మ పరిరక్షణ, శక్తి ఉపాసన, భక్తి మార్గ ప్రచారంలో నిత్యం నిమగ్నమై ఉన్న శక్తి పీఠాధీశ్వరీ రమ్యా నంద భారతీ మహాస్వామిని సోమవారం సాయ ంత్రం తిరుపతితాతయ్యగుంట గంగమ్మకు సారెను సమర్పించారు. తిరుపతిలోని గ్రామ దేవతల ఆలయాలను దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తాతయ్యగుంట గంగమ్మ అమ్మవారిని స్వామిని దర్శించుకున్నారు. వేద మంత్రోచ్చారణల మధ్య విశేష పూజలు నిర్వహించి అమ్మవారికి పట్టు వస్త్ర సమర్పణ చేశారు. భక్తుల శ్రేయస్సు, లోకక్షేమం, ధార్మిక చైతన్యం విస్తరించాలని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఆలయ ఇఒ జయకుమార్ మాతాజీ కి ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికి తీర్థప్రసాదాలను అందజేశారు.ఈ కార్యక్రమంలో శక్తి పీఠం ప్రతినిధులు, ఆలయ అధికారులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

**భవన నిర్మాణ వ్యర్థాలు...**

## ఎక్కడపడితే అక్కడ వేయకుండా చర్యలు చేపట్టండి

**-ఇంచార్జి కమిషనర్ శారదా దేవి**



తిరుపతి,మే 11ప్రభాతవార్త: నగరంలో ఉత్పత్తి అయ్యే భవన నిర్మాణ వ్యర్థాలు ఎక్కడపడితే వేయకుండా ప్రజల్లో అవగాహన కల్పించాలని నగరపాలక సంస్థ ఇంచార్జి కమిషనర్ శారదా దేవి అధికారులకు సూచించారు. ప్రజా పిర్యాదుల పరిష్కార వేదికలో భాగంగా వచ్చిన పిర్యాదులను సోమవారం ఉదయం క్షేత్ర స్థాయిలో అధికారులతో కలసి పరిశీలించారు. అలాగే ఈఎస్ఐ హాస్పిటల్ సమీపంలోని అన్న కాంటీన్లో ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించారు. భవన నిర్మాణ వ్యర్థాలను ఎక్కడంటే అక్కడ పడేస్తున్నారనే పిర్యాదులు వస్తున్నాయని తెలిపారు. భవన నిర్మాణ వ్యర్థాలను తూకివాకం వద్ద గల ప్లాంట్ కు తరలించేలా ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. పారిశుధ్య పనులు మరింత మెరుగ్గా చేపట్టాలని ఆరోగ్య విభాగపు సిబ్బందిని ఆదేశించారు. అన్న కాంటీన్లలో పరిశుభ్రత పాటించాలని నిర్వాహకులకు తెలిపారు. అలాగే నాణ్యమైన ఆహార పదార్థాలు సమయానికి అందించాలని తెలిపారు. ఇంచార్జి కమిషనర్ వెంట మునిసిపల్ ఇంజనీర్ తులసికుమార్, డి. ఈ. రాజు, సర్వేయర్ కోటేశ్వరరావు, టి.పి.ఎస్. వంశీ, తదితరులు ఉన్నారు.

## వేశాలమ్మ తల్లిని దర్శించుకున్న

**-రాయలసీమ రంగస్థలి చైర్మన్ గుండాల గోపీనాథ్**



తిరుపతి,మే 11ప్రభాతవార్త: తిరుపతి గంగజాతర సందర్భంగా స్థానిక వేశాలమ్మ తల్లిని రాయలసీమ రంగస్థలి చైర్మన్ గుండాల గోపీనాథ్ రెడ్డి దర్శించుకుని మొక్కులు చెల్లించు కున్నారు. ప్రతి ఒక్కరూ అమ్మవారిని దర్శించుకుని అమ్మవారి కృపకు పాత్రులు కాగలరని కోరారు. ఆలయ చైర్మన్ జగదీశ్ రెడ్డి దర్శనం ఏర్పాటు చేశారు కార్యక్రమంలో నాయకులు చిత్రపు హనుమంతరావు, హరికృష్ణ తొండము నాటి సుబ్రహ్మణ్యం రెడ్డి తదితరులు పాల్గొన్నారు. తాతయ్య గుంట గంగమ్మ జాతర సందర్భంగా తిరుపతి ముదిరాజ్ యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో భక్తులకు ఉచితంగా మజ్జిగ పంపిణీ సేవ కార్యక్రమం చేపట్టారు. ముఖ్య అతిథి కిషోర్ కుమార్ చంద్ర కార్తీక్, జ్ఞానశేఖర్, జీవరత్నం, దేశయ్య, అధినారాయణ, వెంకటేష్, వెంకటరత్నం, మునస్వామి.తదితరులు అమ్మవారి సేవలో పాల్గొన్నారు.

## యస్వీయూలో జాతీయ సాంకేతిక దినోత్సవ వేడుకలు



తిరుపతి విద్య, మే 11 ప్రభాతవార్త : ఎస్వీయూ ఇంజనీరింగ్ కళాశాలలోని విద్యుత్, విద్యుదీకరణ విభాగం ఆధ్వర్యంలో జాతీయ సాంకేతిక దినోత్సవం-2026 వేడుకలు ఘనంగా నిర్వహించారు. విశ్వవిద్యాలయ సెనేట్ సభామందిరంలో జరిగిన ఈ కార్యక్ర మాన్ని భారతీయ విజ్ఞాన మండలి ఆంధ్రప్రదేశ్ విభాగం, మై భారత్ చిత్తూరు-తిరుపతి విభాగాల సహకారంతో నిర్వహించారు.భారత అణు సాంకేతిక రంగంలో సాధించిన పురోగతి అనే అంశంపై జరిగిన ఈ సమావేశంలో దేశం సాధించిన ప్రోటోటైప్ ఫాస్ట్ బ్రీడర్ రియాక్టర్ విజయాన్ని ప్రత్యేకంగా ప్రస్తావించారు. సుస్థిర అణుశక్తి, దీర్ఘకాలిక ఇంధన భద్రత వైపు దేశం ముందుకు సాగుతోందని వక్తలు వివరించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అణు పరిశోధన కేంద్రం మాజీ సంచాలకులు డాక్టర్ ఎన్. శివరామన్ హాజరయ్యారు.గౌరవ అతిథులుగా యస్వీయూ ఉపకులపతి ఆచార్య టాటా నరసింగరావు, అణు ఇంధన రసాయన విభాగాధిపతి డాక్టర్ సి.వి.ఎస్. బ్రహ్మానందరావు పాల్గొన్నారు. అలాగే కళాశాల ప్రధానాచార్యులు ఆచార్య జి. శ్రీనివాసులు, తిరుపతి భారత విజ్ఞాన విద్యా పరిశోధన సంస్థకు చెందిన డాక్టర్ అనిలాత్మజ ఆర్యసోమయాజుల, భారత సాంకేతిక విద్యాసంస్థ తిరుపతికి చెందిన డాక్టర్ ప్రసన్న కుమార్ బెహరా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఉపకులపతి మాట్లాడుతూ, దేశ అణుశక్తి కార్యక్రమంలో ప్రోటోటైప్ ఫాస్ట్ బ్రీడర్ రియాక్టర్ కీలక మైలురాయిగా నిలిచిందన్నారు. డాక్టర్ ఎన్. శివరామన్, డాక్టర్ సి.వి.ఎస్. బ్రహ్మానందరావు మాట్లాడు తూ ఈ రియాక్టర్ దేశ సుస్థిర ఇంధన భవిష్యత్తుకు బలమైన పునాదిగా నిలుస్తుందని అభిప్రాయపడ్డారు. కార్యక్రమాన్ని విభాగాధిపతి ఆచార్య జె.ఎన్. చంద్రశేఖర్ ఆధ్వర్యంలో నిర్వహించారు.

## రాగి వైర్ల దొంగలను...అదుపులోకి తీసుకున్న పోలీసులు

రేణిగుంట,మే 11 ప్రభాతవార్త: రేణిగుంట రూరల్ సర్కిల్ గాజులమండ్యం పోలీసులు సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి రాగి వైర్లను దొంగతనం చేసే 7 మంది నిందితులను సోమవారం అదుపులోకి తీసుకొని వారి వద్ద నాలుగు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకుని రిమాండ్ కు తరలించారు. పోలీసులు తెలిపిన సమాచారం మేరకు వివరాలు ఇలా... రేణిగుంట మండలం తూకివాకం పంచాయతీ ఎర్రమ రెడ్డి పాలెం పారిశ్రామిక వాడలో ట్రాన్స్ఫార్మర్ల రిపేర్ కంపెనీలో జరిగిన రాగి వైర్లు, రాగి బస్బార్లు, ఇతర రాగి వస్తువులు అపహరణకు గురైన నేపథ్యంలో గాజులమండ్యం పోలీస్ స్టేషన్లో కేసు నమోదు అయింది. జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు ఆదేశాల మేరకు, క్రైమ్ అడిషనల్ ఎస్పీ శ్రీనివాస్ సూచనలతో రేణిగుంట డీఎస్పీ శ్రీనివాసరావు పర్యవేక్షణలో రూరల్ సీఐ మంజునాథరెడ్డి, ఎస్సై హరీష తమ సిబ్బందితో నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి తమిళనాడు రాష్ట్రానికి చెందిన అనిత (27), సరసు (55), హిందూ అలియా సింధు (32) ఇల్లవారాసి అలియాస్ అమ్ము జానీఫా (30), మణికండన్ (28), ఆనందబాబు అలియాస్ ఆనంద్ అలియాస్ సొట్ట (36), కుమార శబరి అలియాస్ సచిన్ (22) లను తిరుపతి బ్లిస్ హోటల్ సమీపంలోని స్క్రాప్ షాప్ వద్ద అదుపులోకి తీసుకొని విచారించగా నేరం ఒప్పుకున్నట్లు పోలీసులు తెలిపారు. వారిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నాలుగు మొబైల్ ఫోన్ లను స్వాధీనం చేసుకొని రిమాండ్ కు పంపారు. పట్టుబడిన ముద్దాయిలు అంతా తమిళనాడు రాష్ట్రం వేలూరు జిల్లాకు చెందిన వారే.. కేసును చేదించడంలో సమర్థవంతంగా పనిచేసిన సీఐ మంజునాథరెడ్డి, ఎస్సై హరీష, హెడ్ కానిస్టేబుల్ మణి, కానిస్టేబుల్లు మణి, దామోదరం, గోపి, రాజశేఖర్, మహేంద్ర, శివ కుమార్, హోం కార్డు మురళిని అధికారులు అభినందించారు.





తాతయ్యగుంట గంగమ్మ జాతరలో భాగంగా సోమవారం సున్నపుకుండల వేషధారణలో భక్తులు. -ప్రభాతవార్త, తిరుపతి

# సూళ్ళూరుపేట డివిజన్

## ఉద్దేశపూర్వకంగానే వ్యవసాయశాఖ సిబ్బందిపై ఆరోపణలు



చిట్టమూరు, మే 11 ప్రభాతవార్త : అరవపాలెం ఆర్ఎస్కే కేంద్ర పరిధిలోని కస్టమ్ హైరింగ్ సెంటర్ గ్రూపు నిర్వహణ, వ్యవసాయ సిబ్బం దిపై కొందరు ఉద్దేశపూర్వకంగా ఆరోపిస్తున్నట్లు తెలుస్తుంది. వైసిపి ప్రభుత్వ హయాంలో సిహెచ్సి గ్రూప్‌ను అన్ని తానై కన్వీనర్, కో కన్వీనర్లతో పాటు గ్రూపు సభ్యులను ఏర్పాటు చేశారు. అయితే ఇటీవల కోకన్వీనర్‌తో ఏర్పడ్డ వ్యక్తిగత విభేదాలు కారణంగానే తరచూ జిల్లా అధికారులకు తమ అనుచరులతో ఫిర్యాదు చేయిస్తూ అధికార యంత్రాంగాన్ని పక్కదోవ పట్టిస్తున్నట్లు సోమవారం నిర్వహించిన అధికారులు విచారణలో తేలింది. సిహెచ్సి గ్రూపులో లక్షల రూపాయలు స్వాహా చేశారని గ్రామానికి చెందిన ఓ మహిళ చేత ఫిర్యాదులు చేసిన నేపథ్యంలో విచారణ అధికారైన పుత్తూరు ఏడిఏ లక్ష్మీదేవి, ఏవో వేణుగోపాల్‌తో పాటు స్థానిక ఏడిఏ డాక్టర్ ఎం నాగార్జునసాగర్ సిహెచ్ గ్రూపు సభ్యులు కన్వీనర్, కో కన్వీనర్లతో సమావేశమై విడివిడిగా వారి అభిప్రాయాలను సేకరించారు. ఇందులో భాగంగా రైతులకు వ్యవసాయ యాంత్రీకరణ పరికరాలు గ్రూప్ ద్వారా అందజేశారని అయితే కొంతమంది రైతులు లోన్ రీపేమెంట్ చేయనందున బ్యాంకు నుంచి గ్రూప్ సభ్యులందరికీ నోటీసులు అందుతున్నాయని వెంటనే రైతుల నుండి బకాయిలను చెల్లించే విధంగా వారిని మోటివేట్ చేసి రుణాలు కట్టించాలని స్థానిక వ్యవసాయ సహాయకులు సునందను విచారణ అధికారులు ఆదేశించారు. ఇవి విచారణకు కోట వ్యవసాయ అధికారి సుచేంద్ర ప్రసాద్ సైతం హాజరై లిఖితపూర్వకంగా తన అభిప్రాయాలను తెలియజేశారు.

## ప్రజల నుంచి వినతలు స్వీకరించిన తహసిల్దార్



నాయుడుపేట, మే 11 ప్రభాత వార్త: మండలం తహసిల్దార్ కార్యాలయంలో సోమవారం పీజీఆర్ఎస్ (గ్రీవెన్స్ డే) సందర్భ ంగా సమస్యలపై వచ్చిన ప్రజల నుంచి వినతలను తహసిల్దార్ జి యువరాజ్ స్వీకరించారు. అనంతరం తాసిల్దార్ మాట్లా డుతూ గ్రీవెన్స్ డే సందర్భంగా వచ్చినటువంటి వినతులుకు తొందరలోనే పరిష్కార మార్గం దిశగా వెళ్లి పరిష్కరిస్తామని ఆయన ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నాయుడుపేట మండలం ఇంచార్జ్ ఎంపీడీవో ప్రమీలరాణి, హౌసింగ్ ఏఈ శ్రీనివాసులు, నాయుడుపేట వెటర్నరీ డాక్టర్ గోవర్ధన్ రెడ్డి, నాయుడుపేట అగ్రికల్చర్ ఏవో గణేష్, ప్రజలు పాల్గొన్నారు.

## మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్‌కి మాతృవియోగం



నాయుడుపేట, మే 11 ప్రభాతవార్త : మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జలదంకి వెంకటకృష్ణారెడ్డి మాతృమూర్తి జలదంకి లీలావతమ్మ (82) గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ సోమవారం తెల్లవారుజామున కన్ను మూశారు. సమాచారం తెలుసుకున్న పలువురు నాయకులు పట్టణంలోని విశ్వభారతి హై స్కూల్ సమీపంలో గల జలదంకి వెంకటకృష్ణారెడ్డి నివాసానికి చేరుకుని ఆయన మాతృమూర్తి లీలావతమ్మ పార్థివ దేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సందర్భంగా మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఉమ్మడి నెల్లూరు జిల్లా వైసీపీ కార్యనిర్వాహక కార్యదర్శి కామిరెడ్డి రాజారెడ్డి, నాయుడుపేట ఏఎంసీ మాజీ చైర్మన్ తంబిరెడ్డి జనార్ధన్ రెడ్డి, వైసిపి నాయుడుపేట పట్టణ అధ్యక్షులు కలికి మాధవరెడ్డి, నియోజకవర్గ ముస్లిం మైనారిటీ అధ్యక్షులు షేక్ షబ్బీర్, నాయుడుపేట మున్సిపల్ మాజీ కౌన్సిలర్లు పాపారెడ్డి చంద్రారెడ్డి, చదలవాడ కుమార్, విక్రమ్ జూనియర్ కళాశాల అధినేత జలదంకి విజయబాబు రెడ్డి, వైసీపీ పట్టణ ప్రధాన కార్యదర్శి పేర్నాటి రాహుల్, నాయకులు గుండాల సురేష్‌రెడ్డి, వేణుంభాక మునస్వామి నాయుడు, తెలుగుదేశం పార్టీ నాయకులు అవధానం సుధీర్, గూడూరు సుధీర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ షేక్ ఫజులుల్లా, పలువురు నాయకులు, అధికారులు లీలావతమ్మ పార్థివ దేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

## ఎమ్మెల్యే సొంత నిధులతో ఆర్థిక ప్రోత్సాహం



నాయుడుపేట, మే 11 ప్రభాతవార్త: పదవ తరగతి ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ప్రోత్సహించేందుకు సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ కీలక నిర్ణయం తీసుకున్నారు. నియోజకవర్గంలోని ప్రతి మండలంలో టాప్ 3 స్థానాల్లో నిలిచిన మొత్తం 25 మంది విద్యార్థులకు తన సొంత నిధుల నుండి నగదు పురస్కారాలను అందజేయనున్నట్లు ఆమె ప్రకటించారు. మండల స్థాయి మొదటి విజేతకు 6,000 రూపాయలు, మండల స్థాయి రెండవ విజేతకు 5,000 రూపాయలు మండల స్థాయి మూడవ విజేతకు 4,000 రూపాయిలు అందజేసారు. ఈ ఏడాది ఫలితాల్లో పెళ్లకూరు మండలానికి చెందిన ఎస్. తనుష (589 మార్కులు), నాయుడుపేట మండలానికి చెందిన సి.హెచ్. శశి (588), నాయుడుపేట టౌన్ నుండి కె. పల్లవి, సి.హెచ్.భాను (587) వంటి విద్యార్థులు అత్యుత్తమ మార్కులతో అగ్రస్థానంలో నిలిచారు. విద్యార్థులు తమ చదువును కొనసాగించి భవిష్యత్తులో గొప్ప డాక్టర్లుగా, ఇంజనీర్లుగా ఎదగాలని ఆమె ఆకాంక్షించారు. ప్రతిభకు పేదరికం అడ్డంకి కాకూడదనే ఉద్దేశంతోనే ఈ చిన్నపాటి ప్రోత్సాహాన్ని అందిస్తున్నట్లు ఎమ్మెల్యే ఈ సందర్భంగా తెలియజేశారు.

## శ్రీహరి కోటలో యువ విజ్ఞాన కార్యక్రమం

సూళ్లూరుపేట, మే 11 ప్రభాతవార్త: శ్రీహరికోటలో సతీష్ ధావన్ స్పేస్ సెంటర్‌లో యు వికా పేరుతో (యువ విజ్ఞాన కార్యక్రమం) 2026 యువ శాస్త్రవేత్తల కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. మే 11వ తేదీ నుంచి నుండి మే 22వ తేదీ వరకు ఇస్రో వ్యాప్తంగా నిర్వహించబడుతోందన్నారు. శ్రీహరికోటలోని ఎస్‌డి ఎస్‌సి, షార్‌తో సహా, ఇస్రోకు చెందిన ఏడు ప్రధాన కేంద్రాలలో ఈ కార్యక్రమం ఏర్పాటు చేయబడింది. మే 11న ఇస్రో ఛైర్మన్ ఈ కార్యక్రమన్ని వర్చువల్ విధానంలో ప్రారంభించారు. షార్ కేంద్రంలో ప్రారంభోత్సవ కార్యక్రమం బిపి హాల్‌లో నిర్వహించారు. ఇస్రో కేంద్రాల డైరెక్టర్లందరూ విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. షార్లో జరుగుతున్న ఈ శిక్షణా కార్యక్రమంలో 57 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వీరిలో 30 మంది బాలురు 27 మంది బాలికలు ఉన్నారు. (ఆంధ్రప్రదేశ్ 15, మధ్యప్రదేశ్ 14, ఛత్తీస్‌గఢ్ 14 ఒడిశా 14) ఈ శిక్షణా కార్యక్రమంలో సీనియర్ శాస్త్రవేత్తల ఉపన్యాసాలు, వివిధ విభాగాల సందర్శనలు, చిన్న రాకెట్ నమూనాలు, రోవర్ కిట్‌ల రూపకల్పన, నక్షత్రాలను వీక్షించడం, యోగా కార్యక్రమాలు మొదలైన అంశాలు నిర్వహించారు. మే 22న జరిగే ముగింపు వేడుకతో ఈ కార్యక్రమం పూర్తవుతుందని ఇస్రో అధికారులు తెలిపారు.

## గ్రీవెన్స్ డేకి విశేషంగా అర్జీలు



దొరవారిసత్రం, మే 11 ప్రభాత వార్త: దొరవారిసత్రం మండలం తహసిల్దార్ కార్యాలయం సోమ వారం గ్రీవెన్స్ డే ప్రజలు భూ సమస్యలపై స్థానిక తహసిల్దార్ ఎం. రాజేంద్రకు అర్జీలు సమర్పిం చుకున్నారు. గ్రీవెన్స్ వచ్చిన ప్రతి అర్జీని ఆయా శాఖలకు బదిలీ చేస్తామని వచ్చిన ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నామని తహసిల్దార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో గోవర్ధన్ ఏఈ వెంకటేశ్వర్లు, ఇరిగేషన్, ఏపిఎం మునిరాజా, ఏవో జ్యోతిర్మయి, హౌసింగ్ ఏఈ లోకేష్, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ ఉమామహేశ్వరి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## నేడు హనుమాన్ శోభాయాత్ర

వెంకటగిరి, మే 11 ప్రభాతవార్త: విశ్వదాయ కాలేజీ ప్రాంగణం నుండి హనుమాన్ శోభాయాత్ర 12వ తేదీ మంగళవారం సాయంత్రం 4:00 గంటలకు ప్రారంభమవుతుందని నిర్వహకులు తెలిపారు. మహా శక్తి శాలి హనుమాన్ జయంతిని పురస్కరించుకొని హిందూ సమాజాన్ని కులాలకతీతంగా పార్టీలకతీతంగా వర్గాలకతీతంగా ఈ దేశాన్ని ధర్మాన్ని రక్షించుకోవాలని సంకల్పం తోటి శోభాయాత్ర చేయడం జరుగుతుందని చెప్పారు. హనుమాన్ శోభాయాత్రలో అందరూ పాల్గొని విశ్వహిందూ పరిషత్ కమిటీ సభ్యులు పిలుపునిచ్చారు.

# స్కిట్ సమస్యకు పరిష్కారం

## మాస్టర్‌ప్లాన్‌పై స్పష్టత : ఇఓ బికె వెంకటేశులు

శ్రీకాళహస్తి, మే 11 ప్రభాతవార్త:



శ్రీకాళహస్తీశ్వరాలయ అభివృద్ధితో పాటు భక్తుల సదుపాయాలకు పెద్ద పీట వేస్తున్నామని ఇఓ బికె వెంకటేశులు తెలిపారు. సోమవారం ఆయన ప్రభాతవార్తతో మాట్లాడుతూ తాను బాధ్యతలు చేపట్టిన తరువాత ఇక్కడ సమస్యలపై సమగ్రంగా అధ్యయనం చేసామన్నారు. శ్రీకాళహస్తీశ్వరాలయానికి వచ్చే భక్తులు ఎదుర్కొంటున్న సమస్యలకు సంబంధించి సమగ్రంగా అధ్యయనం చేసిన తరువాత పలు నిర్ణయాలు తీసుకున్నామన్నారు. ముఖ్యంగా భక్తుల సదుపాయాలతో పాటు, వచ్చిన భక్తులకు అవసరమైన వెసులుబాట్లు కల్పిస్తున్నామన్నారు. ముఖ్యంగా జటిలమైన సమస్యలపై దృష్టి సారించామన్నారు. శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా సుమారు పాతికేళ్ళు నిర్వహించిన స్కిట్ సమస్య పరిష్కార దిశగా అడుగులేస్తుందన్నారు. దేవస్థానం కళాశాలను జేయన్‌టియు అనంతపురానికి అప్పగించామన్నారు. స్కిట్‌ను తీసుకున్న అనంత జేయన్‌టియు 50 ఎకరాల స్థలాన్ని కోరారని అయితే తాము అంత ఇవ్వలేమంటూ సూచించామన్నారు. ఇక్కడ ఐదెకరాల స్థలంలో నర్సింగ్ పాఠశాల ఉందని అలాగే 10 ఎకరాలు ఉద్యానవన పంటల నిర్వహణకు అందించామన్నారు. అలాగే మాస్టర్‌ప్లాన్ నిర్వహణకు సంబందించి పలు మార్లు జిల్లా కలెక్టర్ దృష్టికి తెచ్చామన్నారు. దాంతో స్పందించిన కలెక్టర్ ఆర్‌డిఓకు బాధ్యతలు అప్పగించారన్నారు. బాదితుడు కూడా కోర్టులో కేసులు విత్‌డ్రా చేసుకున్నారన్నారు. తాము కోట్లు చెల్లించే సమయంలో ఎలాంటి వివాదాలు లేకుండా చూసుకోవాలి కదా? ఈ ఆస్తిమీద పలు అప్పులు ఉన్నాయని వాటిని తీర్చి అప్పగించాల్సి ఉందన్నారు. ఈ మేరకు చర్యలు తీసుకుంటున్నామన్నారు.

భక్తుల సదుపాయాలు:

తానుబాధ్యతలు స్వీకరించిన తరువాత భక్తుల బస సదుపాయాల మీద దృష్టి సారించినట్లు ఇఓ బికె వెంకటేశులు తెలిపారు. ఈ మేరకు కోట్లు వెచ్చించి లోబావిలో నిర్మించిన సుమారు 120గదుల అతిధి గృహాల్లో భక్తులను ఆకర్షించుటకు మధ్యాహ్నం భోజనం రాత్రి అల్పాహారం ఏర్పాటు చేసామన్నారు. ఇక్కడ చక్కగా సదుపాయాల నిర్వహణకు సిబ్బందిని నియమించామన్నారు. ఇక అక్కడకు చేరుకోవటానికి ఉచిత బస్సు సదుపాయం కల్పించినట్లు తెలిపారు. కాగా ఆర్‌టిసి బస్టాండు, రైల్వే స్టేషన్ వద్దకు క్రమంగా ఉచిత బస్సు సదుపాయం కల్పించామన్నారు. ఇక ఆలయం చుట్టూ భక్తులు వేసవి కాలం భక్తులు ఇబ్బంది పడకుండా కాళ్ళు కాలకుండా నీడ కల్పించామన్నారు. అయితే తేరువీధిలో పరిస్థితి ఏ చర్యలు తీసుకోలేకపోతున్నామన్నారు. మొదట తివాచిలు ఇక్కడే పరచామన్నారు. కానీ ఇరుకు వీధులలో వన్ సైడ్ పార్కింగ్‌తోఇక్కట్లు చోటు చేసుకున్నాయన్నారు. అక్కడ భక్తుల సదుపాయాలకు పరిశీలిస్తున్నట్లు వివరించారు. రాబోవు రోజుల్లో సదుపాయాల కల్పనకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. రాబోవు ధర్మరాజుల స్వామి బ్రహ్మోత్సవాలు, ఆడికృత్తిక మహోత్సవాలకు సంబంధించి ప్రత్యేక సిబ్బందిని నియమించి బాధ్యతలు అప్పగించినట్లు ఇఓ వివరించారు. ఇక ఆలయం లోపల ఎలాంటి ఇబ్బంది లేకుండా కూలర్లు, ఫ్యాన్లు, ఏసిలు పని చేసే విధంగా చర్యలు తీసుకున్నామని ఇఓ వెంకటేశులు వివరించారు. ఇక అనుబంధ ఆలయాలలో ఉత్సవాలకు అత్యధిక ప్రాధాన్యత కల్పిస్తున్నట్లు తెలిపారు.

# తిరుపతి డివిజన్

## శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవు

### డీఎస్పీ శ్రీనివాసరావు...



రేణిగుంట మే 11 ప్రభాతవార్త

తిరుపతి జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు ఆదేశాల మేరకు శాంతిభద్రతలకు విఘాతం కల్పిస్తే చర్యలు కచ్చితంగా ఉంటాయని డీఎస్పీ శ్రీనివాసరావు తెలిపారు. సబ్ డివిజన్ పరిధిలో నెలరోజుల పాటు సెక్షన్ 30 పోలీస్ యాక్ట్ అమల్లో ఉంటుందని తెలిపారు. పోలీసు శాఖ ముందస్తు అనుమతులు లేకుండా ర్యాలీలు, ధర్నాలు, రాస్తారోకోలు చివరకు సభలు కూడా నిర్వహించకూడదన్నారు. గుంపులు గుంపులుగా ఎలాంటి కార్యక్రమాలను నిర్వహించకూడదని చెప్పారు. రేణిగుంట సబ్ డివిజన్ పరిధిలోని రేణిగుంట, గాజులమండ్యం, ఏర్పేడు, రైల్వే కోడూరు, ఓబులవారిపల్లె, చిట్వేలి, పుల్లంపేట, పెనగలూరు పోలీస్ స్టేషన్ల పరిధిలో యాక్ట్ అమల్లో ఉందన్నారు, నిషేధాజ్ఞలు ఉల్లంఘించినా, శాంతిభద్రతలకు విఘాతం కలిగించినా చర్యలు కఠినంగా ఉంటాయని హెచ్చరించారు.

## బడి పిలుస్తుంది కార్యక్రమం

పెనగలూరు మే 11 ప్రభాతవార్త

రైల్వే కోడూరు నియోజకవర్గం పెనగలూరు మండలంలో 12వ తేదీన ఉదయం జెడ్ పి హెచ్ స్కూల్, పెనగలూరు నందు జరుగు "బడి పిలుస్తుంది"మీటింగ్ మరియు ర్యాలీ జరుగును. ఈ కార్యక్రమం కు ముఖ్య అతిథులు రైల్వే కోడూరు ఎమ్మెల్యే ఆరవ శ్రీధర్, తిరుపతి జిల్లా విద్యాశాఖ అధికారి, ఉప విద్యాశాఖ అధికారి తిరుపతి హాజరుకానున్నారు. కావున మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల హెడ్మాస్టర్లు హెడ్ టీచర్లు, ఉపాధ్యాయులు అందరూ హాజరుకావాలని తెలియజేయడమైనది. పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో మండల స్థాయిలో ప్రథమ ద్వితీయ తృతీయ మార్కులు సాధించిన విద్యార్థులను యం ల్ ఏ మరియు జిల్లా స్థాయి అధికారులు సన్మానించనున్నారు. ప్రతి ఉన్నత పాఠశాలలో ప్రథమ ద్వితీయ తృతీయ మార్కులు సాధించిన విద్యార్థులకు ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు సహకారంతో సన్మానించబడునని తెలిపారు.

# ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ బడులు

చిట్వేలి, మే 11,ప్రభాతవార్త:

ప్రభుత్వం విద్యాభివృద్ధి కోసం నిర్వహిస్తున్న కార్యక్రమాలు, కల్పిస్తున్న వసతులతో ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ బడులు ఉన్నాయని జిల్లా విద్యాశాఖ అధికారి కే.వి.ఎన్ కుమార్ అన్నారు. సోమవారం స్థానిక ఉన్నత పాఠశాలలో విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు, స్థానిక నాయకులతో కలిసి బడి పిలుస్తుంది కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ ఏడాది పదవ తరగతిలో అత్యధిక మరియు 500 కు పైగా మార్కులు సాధించిన విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా విద్యాశాఖ అధికారి కె.వి.ఎన్.కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ బడుల్లో పిల్లల పట్ల ప్రత్యేక శ్రద్ధతో డిజిటలైజేషన్ వంటి సాంకేతికతతో విద్యా బోధన చేపడుతున్నారని అన్నారు. మండల విద్యాశాఖ అధికారులు మాట్లాడుతూ మన ఊరు బడులను మనమే బలోపేతం చేసుకోవాలని బడి ఈడు పిల్లలందరినీ ప్రభుత్వ బడుల్లో చేర్పించాలని కోరారు. టిడిపి మండల బాధ్యుడు కాకర్ల నాగార్జున మాట్లాడుతూ విద్యా వ్యవస్థలో మంత్రి నారా లోకేష్ విప్లవాత్మక మార్పులతో విద్యా వ్యవస్థను పటిష్టం చేశారన్నారు. పది ఫలితాలలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు సత్తా చాటేలా చేశారన్నారు. విద్యార్థులకు సర్వేపల్లి విద్యార్థి మిత్ర కిట్టు ద్వారా పుస్తకాలు, యూనిఫామ్, షూ, బెల్ట్, బ్యాగ్ మొదలగు వస్తువులను ఉచితంగా అందివ్వడం జరుగుతుందని, నాణ్యమైన విద్యతో పాటు రుచి, శుచితో కూడిన డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం అందివ్వడం జరుగుతుందన్నారు., మన ఊరు పిల్లలందరినీ మన ఊరు బడిలో చేర్పించి ప్రభుత్వ పాఠశాలను బలోపేతం చేయాలని తెలిపారు. తదుపరి మండల ప్రజాప్రతినిధులు, మండల విద్యాశాఖ అధికారులు, తల్లిదండ్రులు మరియు విద్యార్థులతో కలిసి "బడి పిలుస్తోంది" ఇంటింటికీ ప్రచార రథాన్ని అధికారి కె.వి.ఎన్ కుమార్ జండా ఊపి ప్రారంభించారు. ప్రచార ర్యాలీ మండలంలోని ప్రధాన వీధుల్లో ఉత్సాహభరితంగా కొనసాగింది. ఈ కార్యక్రమంలో భాగంగా, అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థుల ఘన ఊరేగింపు, ప్రభుత్వ పాఠశాలల్లో చేరిన విద్యార్థులకు ఎన్రోల్మెంట్ పత్రాల అందజేత, మానవహారం మరియు అవగాహన ర్యాలీ, ప్రభుత్వ విద్య ప్రాముఖ్యతపై విద్యార్థులు కోలాటం ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఏ.ఎం.ఓ చంద్రశేఖర్ నాయుడు, తిరుపతి జిల్లా ఐటీ సెల్ ఇంచార్జ్ ధనుంజయ నాయుడు మరియు మండల విద్యాశాఖ అధికారులు ఖాజా మొయిద్దీన్, ఈశ్వరయ్య, హెచ్ఎం దుర్గారాజు, పాఠశాల కమిటీ చైర్మన్ శివశంకర్ రాజు, టిడిపి నాయకులు లారీ సుబ్బరాయుడు, రామాంజనేయులు నాయుడు, వెంకటేశ్వరరాజు, ఉపాధ్యాయులు, సి.ఆర్.ఎం.టి లు, తల్లిదండ్రులు, విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



ప్రచార రథాన్ని ప్రారంభిస్తున్న జిల్లా అధికారి కుమార్.

## గ్రామాలలో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవు

### డీఎస్పీ శ్రీనివాసరావు



ఓబులవారిపల్లి 11 మే ప్రభాతవార్త

రైల్వే కోడూరు నియోజకవర్గంలోని ఐదు మండలాల్లోనూ ప్రజలకు ఎటువంటి సమస్యలు తలెత్తకుండా శాంతిభద్రతలకు గ్రామాలలో ప్రజలకు విభాగం కల్పించిన. అలాగే ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు పాల్పడిన 30 పోలీస్ యాక్ట్ అమల్లో ఉందని ఓబులవారిపల్లి ఎస్ఐ మహేష్ నాయుడు సూచించారు సోమవారం ఆయన తిరుపతి జిల్లా రేణిగుంట డివిజన్ డిఎస్పి శ్రీనివాసరావు ఆదేశాల మేరకు గ్రామాల్లో పర్యటించి ఎక్కడ ఇటువంటి సమస్యలు లేకుండా పోలీస్ యాక్ట్ ప్రకారం చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడి వ్యక్తులు పైన పిడి యాక్ట్ లాంటి కేసులు నమోదు చేసి చట్టబద్ధంగా కఠిన చర్యలు తీసుకొని శిక్షి ంచడం జరుగుతుందని ఆయన సూచించారు ప్రజల ధనమానప్రాణాలు కాపాడేందుకే పోలీసులు ప్రతిక్షణం ప్రజా సేవలో ఉన్నారని ఆయన సూచించారు ప్రతి ఒక్కరు అనుమానితుల గ్రామాల్లో తిరిగిన ఏవైనా ఊర్లకు వెళ్లేటప్పుడు పోలీసులకు సమాచారం అందించాలన్నారు దీనివెంట ఓబులవారిపల్లి పోలీసులు ఏఎస్ఐ వెంకటరమణ పోలీస్ సిబ్బంది ఉన్నారు

## ప్రజా దర్బార్ పీజీఆర్ఎస్‌కు 18 వినతిపత్రాలు

### తహసీల్దార్

కేవీబీ పురం, మే 11 ప్రభాతవార్త:

మండల కేంద్రమైన కేవీబీపురంలో సోమవారం పీజీఆర్ఎస్ కార్యక్రమం నిర్వహించారు. మండల స్థాయి అధికారులు స్థానిక పోలీస్ సబ్ ఇన్‌స్పెక్టర్ ఓబయ్య పాల్గొన్నారు. వివిధ రకాల సమస్యలతో మండల ప్రజలు అందించారని వాటన్నింటిని ప్రభుత్వం నిర్ణయం ప్రకారం ఆన్‌లైన్‌లో పెట్టి సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడతామని ఆమె పేర్కొన్నారు. సమస్యలు వ్యక్తిగత పాస్ పుస్తకాలు ఇంటి పట్టాలు తదితర సమస్యలపై వాటిపై ప్రజలు వారి సమస్యలను వినతి పత్రాలు అందించారు. ఈ సందర్భంగా 18 వినతి పత్రాలు వచ్చినట్లు ఆమె పేర్కొన్నారు.

## జ్యోతిభాసునగర్ ఇంటి పట్టా ఇవ్వాలి - తహసీల్దార్‌కి వినతి

పుత్తూరు రూరల్, మే 11 ప్రభాతవార్త: పుత్తూరు పట్టణంలోని జ్యోతిభాసునగర్‌లో గత 15 సంవత్సరాలుగా కొంత మంది స్థలం కట్టుకుని కొంత మంది కడగాలు వేసుకుని ఉన్నారు. వారికి ఇంటి పట్టాలు ఇవ్వాలని సోమవారం గ్రీవెన్స్‌డే సందర్భంగా పుత్తూరు తహసీల్దార్ వెంకటేశ్వరరావుకి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2008లో ఇందిరమ్మ పేరుతో కట్టినప్పటి నుంచి పట్టాలు ఇవ్వాలని అధికారులు చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే ఇంటి పట్టాలు ఇచ్చి హౌసింగ్ మంజూరు చేయాలని కోరారు. జ్యోతిభాసునగర్‌కి మౌలిక వసతులు తాగునీటి సమస్య, డ్రైనేజీ, రోడ్డు సౌకర్యం వంటి సమస్య పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్‌కి వినతిపత్రం అందజేశారు. ఆయన స్పందించి మీకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం కార్యదర్శి వెంకటేష్, జ్యోతిభాసునగర్ వాసులు పాల్గొన్నారు.

## అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు సన్మాన కార్యక్రమం



పుత్తూరు రూరల్, మే 11 ప్రభాతవార్త:

పుత్తూరు పట్టణ పరిధిలోని 19వ వార్డు జడ్పీహెచ్ఎస్ కళ్యాణపురం పాఠశాలలో పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులకు ప్రత్యేక సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు ఆనందబాబు అధ్యక్షతన నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ ఆశీర్వాదాలతో ముమ్మడి ఉషారాణి, కృష్ణకుమార్ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. మున్సిపల్ కమిషనర్ నాగేశ్వరరావు, ఎంఈవో-2 బాలసుబ్రహ్మణ్యం, టీడీపీ పట్టణ అధ్యక్షుడు గాలి జీవరత్నంనాయుడు ముఖ్య అతిథులుగా పాల్గొని విద్యార్థులను అభినందించారు. అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు నగదు బహుమతులు, నోటు పుస్తకాలు, ఎగ్జామ్ ప్యాడ్లు, పెన్నులు అందజేసి ప్రోత్సహించారు. ఈ సందర్భంగా కృష్ణమకుమార్ మాట్లాడుతూ ఉపాధ్యాయుల కృషి, తల్లిదండ్రుల ప్రోత్సాహమే ఉత్తీర్ణత శాతం పెరగడానికి కారణమని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సచివాలయ సిబ్బంది, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## డయల్ యువర్ ఎస్పీడీసీఎల్ సిఎండికి 54 వినతులు



తిరుపతి, మే 11 ప్రభాతవార్త:

ఎస్పీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో సోమవారం ఉదయం నిర్వహించిన డయల్ యువర్ ఎస్పీడీసీఎల్ సిఎండిఖి కార్యక్రమానికి 54 వినతులు అందినట్లు ఆ సంస్థ సిఎండి శివశంకర్ లోతేటి తెలిపారు. ఈ కార్యక్రమం సందర్భంగా పలువురు వినియోగదారులు తమ విద్యుత్ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఈ కార్యక్రమం ద్వారానే కాకుండా వినియోగదారులు విద్యుత్ శాఖ టోల్ ఫ్రీ నంబర్లు: 1912 , 1800 425 155333కు కాల్ చేయడం ,వాట్సాప్ నంబరు: 91333 31912కు చాట్ చేయడం ద్వారా విద్యుత్ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి, పరిష్కరించుకోవచ్చని తెలియజేశారు.

## పి.జి.ఆర్.ఎస్‌కు 55 ఫిర్యాదుదారులు

తిరుపతి, మే 11ప్రభాతవార్త:



జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన పి.జి.ఆర్.ఎస్. కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా వచ్చిన ఫిర్యాదుదారుల నుంచి వినతులను స్వయంగా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు స్వీకరించారు. కార్యక్రమానికి హాజరైన ప్రతి ఫిర్యాదుదారుడి సమస్యను శ్రద్ధగా విని, వాటిపై తక్షణ చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా సుమారు 55 మంది ఫిర్యాదుదారుల నుంచి వివిధ అంశాలకు సంబంధించిన వినతులు అందాయి. అందిన ప్రతి ఫిర్యాదును సంబంధిత అధికారులకు వెంటనే పంపించి, వాటిని ప్రాధాన్యత ఆధారంగా పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలన్నారు.

## రాయల చెరువు ముంపు ప్రాంతాల నష్టపోయిన పంట పొలాలకు న్యాయం చేయండి



కేవీబీ పురం, మే 11 ప్రభాతవార్త:

తిరుపతి జిల్లా కేవీబీ పురం మండలం ఓల్లూరు రాయల చెరువు గండి కారణంగా చెరువు కింద ఉన్న పంట పొలాలు, పంటలు దెబ్బతిని రైతులు తీవ్రంగా నష్టపోవడం జరిగింది. రైతులకు సంబంధించిన వ్యవసాయ పరికరాలు కొట్టుకుని పోయాయి. అయినా ప్రభుత్వం సహాయం చేయకపోవడంతో భారతీయ కిసాన్ సంఘం తిరుపతి జిల్లా శాఖ ఆధ్వర్యంలో కేవీబీ పురం తహసీల్దార్ కార్యాలయం వద్ద రైతులకు మద్దతుగా ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా భారతీయ కిసాన్ సంఘ రాష్ట్ర కార్యదర్శి రాజారెడ్డి పాల్గొని మాట్లాడుతూ రైతులు తీవ్రంగా నష్టపోయి ఇబ్బందులకు ఎదుర్కొంటుంటే నెల రోజుల్లో సహాయం చేస్తామన్న అధికారులు మొహం దాటేశారని రైతులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారని వారికి రావలసిన నష్ట పరిహారాన్ని వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. చెరువుకు పడిన గండిని పూడ్చి సాగునీటిని అందించాలని, చెరువు కింద రైతులు బ్యాంకులో తెచ్చుకున్న రుణాలను వెంటనే రద్దు చేయాలని కోరారు. తిరుపతి జిల్లా అధ్యక్షుడు శశి కిరణ్ మాట్లాడుతూ రైతు సమస్యలు వెంటనే పరిష్కరించకుంటే ఈ నెలాఖరులో రైతులను కలుపుకుని ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామన్నారు. అనంతరం తహసీల్దార్ తనూజకి వినతిపత్రం అందజేశారు. తహసీల్దార్ మాట్లాడుతూ రైతు సమస్యలను ఈ నెలాఖరులోపు అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామని తెలియజేశారు. కార్యక్రమంలో రైతులు, కిసాన్ సంఘ సభ్యులు పాల్గొన్నారు.

## చేనేతకు ఊరటనిచ్చిన ఉచిత విద్యుత్

### ప్రభుత్వ నిర్ణయంపై చేనేతల హర్షం - ఏఈకి ఘన సత్కారం



వరదయ్యపాలెం, మే 11, ప్రభాతవార్త

చేనేత, మర మగ్గాలకు ఉచిత విద్యుత్ అందించే ప్రభుత్వ నిర్ణయం పట్ల చేనేత కార్మికుల్లో ఆనందం వెల్లివిరిసింది. ఇప్పటికే పెరుగుతున్న నూలు ధరలు, కార్మిక వ్యయాలు, మార్కెట్ సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న చేనేత రంగానికి ఈ నిర్ణయం పెద్ద ఊరటనిచ్చిందని చేనేత నాయకులు పేర్కొన్నారు. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం గ్రామీణ చేనేత కుటుంబాల ఆర్థిక భారం తగ్గించడంతో పాటు, సంప్రదాయ వృత్తికి మళ్లీ ప్రోత్సాహం కలిగిస్తుందని వారు అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా చిన్నచిన్న చేనేత యూనిట్లు, మర మగ్గాలపై ఆధారపడి జీవిస్తున్న కుటుంబాలకు ఉచిత విద్యుత్ ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ సందర్భంగా ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేస్తూ స్థానిక విద్యుత్ శాఖ ఏఈను చేనేత కార్మికులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సీనియర్ చేనేత నాయకులు బుర్రా కృష్ణమూర్తి మాట్లాడుతూ చేనేత రంగం కేవలం వృత్తి మాత్రమే కాదు, మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం చేనేత కుటుంబాల్లో కొత్త ఆశలు నింపిందని అన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ చేనేత నాయకులు బుర్రా కృష్ణమూర్తి, దొడ్డి సిద్దులయ్య, గుత్తి త్యాగరాజు, పొన్నేరి గోపి, జయప్రకాశ్, రామలింగయ్య, వెంకటరాయులు, పెరిశెట్ల కృష్ణ, మాచెర్ల చెంచయ్య, తాళ్ల కిరణ్, ఆకాశం ప్రసాద్, జాకీర్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

## తిరుపతిరూరల్‌లో రోమ్మల ఫౌండేషన్ సేవా కార్యక్రమాలు

### -చలివేంద్రం ఏర్పాటు...అన్నదాన కార్యక్రమం

తిరుపతిరూరల్, మే 11 ప్రభాతవార్త:



మండుతుల ఎండలను దృష్టిలో ఉంచుకుని తిరుపతిరూరల్ మండలం తనపల్లిలో రోమ్మల ఫౌండేషన్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు నిర్వహించారు. సోమవారం చలివేంద్రం ఏర్పాటు చేసి, మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. చలివేంద్రం ఏర్పాటులో భాగంగా పేదలు, ప్రయాణికులకు శీతల పానీయాలు, మజ్జిగ, సోడా తదితర పానీయాలను విరివిగా అందజేశారు. అలాగే అన్నదానం ద్వారా అనేకమంది ఆకలి తీర్చుకున్నారు. ఈ సందర్భంగా రోమ్మల ఫౌండేషన్ అధ్యక్షుడు రాజేష్‌రెడ్డి మాట్లాడుతూ మండుతున్న వేడి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ప్రజలకు ఉపశమనం కలిగించాలనే ఉద్దేశంతో చలివేంద్రం ఏర్పాటు చేశామని తెలిపారు. పేదల ఆకలి నివారణ కోసం అన్నదాన కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నామని పేర్కొన్నారు. స్థానికులు ఫౌండేషన్ సేవలను ప్రశంసిస్తూ...ఇలాంటి కార్యక్రమాలు మరింత విస్తరించాలని కోరారు.


కెనరా బ్యాంక్ Canara Bank Together we can | తిరుపతి సరోజినిదేవి లేఔట్ శాఖ (13171), తిరుపతి, తిరుపతి జిల్లా

**రుణగ్రహీత/హామీదారు/తనఖాదారులకు డిమాండ్ నోటీసు**

టు తేది: 06.05.2026

రుణగ్రహీత: మెస్సర్స్ పాలడుగు ట్రేడర్స్ ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్లు, 1) రాణీ పాలడుగు 2) పి.ఎస్.మురళీధర్, భరత్ ఇంజినీరింగ్ వర్క్స్, 8-67, 4వ వీధి, శ్రీనగర్ కాలనీ, సత్యనారాయణ పురం, తిరుపతి - 517501

తనఖాదారు & గ్యారంటారు: పి.ఎస్.మురళీ ధర్, భరత్ ఇంజినీరింగ్ వర్క్స్, 8-67, 4వ వీధి, శ్రీనగర్ కాలనీ, సత్యనారాయణ పురం, తిరుపతి - 517501, సెల్ం 93936 30693,

తనఖాదారు & గ్యారంటారు: ఆదూరి పద్మావతి, భర్త పి.ఎస్.మురళీధర్, భరత్ ఇంజినీరింగ్ వర్క్స్, 8-67, 4వ వీధి, శ్రీనగర్ కాలనీ, సత్యనారాయణ పురం, తిరుపతి - 517501, సెల్:93936 36309

తనఖాదారు: పి.భాస్కర్‌నాయుడు, తండ్రి లేట్ పి.బాలసుబ్రమణ్యంనాయుడు నివాసం: 8/67, శ్రీనగర్ కాలనీ, తిమ్మినాయుడుపాళెం, తిరుపతి, చిత్తూరు - 517501, ఆంధ్రప్రదేశ్

గ్యారంటారు: రాణిపాలడుగు, భరత్ ఇంజినీరింగ్ వర్క్స్, 8-67, 4వ వీధి, శ్రీనగర్ కాలనీ, సత్యనారాయణ పురం, తిరుపతి, ఆంధ్రప్రదేశ్- 517501, సెల్: 93936 39630

అయ్యా/ అమ్మా !

విషయం: సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం,2002 సెక్షన్ 13(2) క్రింద డిమాండ్ నోటీసు

మా కెనరాబ్యాంక్, తిరుపతి సరోజిని దేవి లేఔట్ శాఖ(13171)నుండి మీరు మెస్సర్ పాలడుగు ట్రేడర్స్ ప్రైవేట్ లిమిటెడ్, భాగస్వాములు, రాణీ పాలడుగు, పి.ఎస్.మురళీధర్, & ఆదూరి పద్మావతి గారు కాలానుగుణంగా పొందిన లోన్స్/ రుణసౌకర్యాల వివరములు

| రుణ స్వభావం | మంజూరు చేసిన రుణం మొత్తం | ఖాతా నెంబరు | 06.05.2026 తేది నాటికి బకాయి మొత్తం | వడ్డీ రేటు(2% పీనల్ వడ్డీతో సహా. |
|---|---|---|---|---|
| Term Loan | Rs.46,00,000 | 170006876166 | Rs. 21,60,913.87 | 12.25 % |
| MSME OD/OCC | Rs.1,00,00,000 | 125003235670 | Rs.1,02,04,638.51 | 12.65% |

మాకు తనఖా పెట్టిన వ్యక్తి / వ్యక్తులచే వ్రాసి ఇవ్వబడిన సంబంధిత డాక్యుమెంట్ల ద్వారా ఈ నోటీసు షెడ్యూలులో వివరించిన ఆస్తుల తనఖా ద్వారా పైన తెలిపిన ఋణాలు/ ఋణసౌకర్యాలకు తగు విధంగా హామీ కల్పించబడినది. పేర్కొన్న నియమ నిబంధనల ప్రకారం తమ ఋణాలను చెల్లించడంలో విఫలమైనందున బ్యాంకు సదరు ఋణాన్ని **తేది:31.03.2026** నిరర్ధక ఆస్తిగా (ఎన్‌పిఏగా) వర్గీకరించినది. అందువలన ఈ నోటీసు తేది నుండి 60 రోజులలోగా **రూ.1,23,65,552.38 పై (ఒక కోటి ఇరవై మూడు లక్షల అరవై ఐదు వేల ఐదు వందల యాభై రెండు రూపాయలు ముప్పై ఎనిమిది పైసలు మాత్రమే)**లను + తదుపరి వడ్డీ, ఖర్చులు కలిపి మొత్తమును చెల్లించవలసినదిగా కోరుతూ సంబంధిత చట్టంలోని సెక్షన్ 13(2) క్రింద మీకు ఈ నోటీసును జారీ చేయుచున్నాము. చెల్లించడంలో విఫలమైతే సదరు చట్టంలోని సెక్షన్ 13(4) క్రింద అన్ని లేదా ఏవేని హక్కులను మేము వినియోగించుకుంటాము. అంతే కాకుండా మా ముందస్తు సమ్మతి లేకుండా ఏ విధంగానూ షెడ్యూలులో తెలిపిన ఏ సెక్యూర్డ్ ఆస్తులతో ఏ రకంగానూ వ్యవహరించ కుండా మీరు నిరోధింప బడుచున్నారు. సదరు చట్టం మరియు / లేదా అమలులో వున్న చట్టం క్రింద లభించే ఏవేని ఇతర హక్కులకు ఎటువంటి ప్రతికూల అభిప్రాయం లేకుండా ఈ నోటీసు ఇవ్వబడింది.

సర్ఫేసి చట్టంలోని సెక్షన్ 13 సబ్ సెక్షన్ (8) ప్రకారము మీరు తనఖా ఆస్తులను విడిపించు కోవడానికి ఉన్న కాల వ్యవధిని వినియోగించు కోగలరని సూచించడమైనది. మా శాఖ రికార్డులలో అందుబాటులో వున్న మీ చిరునామాకు తిరుగు రశీదుతో కూడిన రిజిస్టర్ పోస్టు ద్వారా డిమాండ్ నోటీసు పంపించడం జరిగినది.

**షెడ్యూలు: తనఖాలో వున్న ఆస్తి యొక్క వివరములు దిగువ తెలుపడమైనది.**

1)చిత్తూరు జిల్లా, శ్రీ బాలాజి రిజిస్ట్రేషన్ జిల్లా, తిరుపతి రూరల్ సబ్ జిల్లా, తిరుపతి రూరల్ మండలం, నెం.21, తుమ్మలగుంట గ్రూపు, నెం.47, వేదాంతపురం గ్రామ లెక్కదాఖలా మెట్ట సర్వేనెం.248/1సి, సత్యసాయి నగర్, 1వ వెంచర్ లోని ప్లాటు నెం.146 గల ఖాళీ స్థలం హద్దులు: తూర్పు:ప్లాటు నెం.145, పడమర: ప్లాటు నెం.147, ఉత్తరం: ఇతరుల భూమి, దక్షిణం: 33అ. వెడల్పు గల రోడ్డు, ఈ హద్దుల మధ్య తూర్పు నుండి పడమర: ఉత్తరం వైపు: 34అ. లేదా 10.36మీ. దక్షిణం వైపు: 33అ. లేదా 10.06మీ. ఉత్తరం నుండి దక్షిణం: తూర్పు వైపు 55అ. లేదా 16.67మీ. పడమర వైపు: 55అ. లేదా 16.67మీ. వెరశి 1842.5చ.అ. లేదా 204.72చ.గ. ఖాళీ స్థలం పూర్తిగా.

**టైటిల్ హోల్డరు పేరు: పి.ఎస్.మురళీధర్.**

2)తిరుపతిజిల్లా, శ్రీ బాలాజి రిజిస్ట్రేషన్ జిల్లా, తిరుపతి చంద్రగిరి సబ్ జిల్లా, చంద్రగిరి మండలం, మిట్టపాళెం గ్రామ పంచాయతీ, నెం.67 మిట్టపాళెం గ్రామ లెక్కదాఖలా సర్వేనెం.443-1 లో ఎ.2.76సెంట్లు ఆర్.ఓ.ఆర్. సబ్ డివిజన్ అనంతరం 443-1ఎ లో ఎ.0.40 సెంట్లు సర్వేనెం.443-1బి లో ఎ.0.35 సెంట్లు సర్వేనెం.443-1బిలో ఎ0.75 సెంట్లు వెరశి సర్వేనెం.443-1ఎ & 443-1బిలోని ఎ.1.50 సెంట్లలో వేసిన రెసిడెన్షియల్ లేఔట్ ప్లాట్లలో ప్లాటు నెం.15. ఈ హద్దుల మధ్య తూర్పు-పడమర :50అ. లేదా 15.250మీ. ఉత్తరం - దక్షిణం: 33అ. లేదా 10.065మీ. వెరశి 1650చ.అ. లేదా 183.33 చ.గ. లేదా 45.83 అంకణములు స్థలం పూర్తిగా హద్దులు : తూర్పు: ప్లాటు నెం.6, దక్షిణం: ప్లాటు నెం.14, పడమర: 30అ. వెడల్పు గల రోడ్డు, ఉత్తరం: ప్లాటు నెం.16.

**టైటిల్ హోల్డరు పేరు: ఎ.పద్మావతి**

3) తిరుపతి జిల్లా, శ్రీ బాలాజి రిజిస్ట్రేషన్‌జిల్లా, తిరుపతి సబ్ జిల్లా, తిరుపతి రూరల్ మండలం, నెం.21 తుమ్మలగుంట గ్రూపు నెం.47 వేదాంతపురం గ్రామ లెక్కదాఖలా మెట్ట సర్వేనెం.248/1సి లో సత్యసాయి నగర్ 1వ వెంచర్‌లోని ప్లాటు నెం.143. ఈహద్దుల మధ్య తూర్పు నుండి పడమర: 39 1/2అ. లేదా 12.04మీ. ఉత్తరం నుండి దక్షిణం: 56అ. లేదా 16.97మీ. వెరశి 2212 చ.అ. లేదా 245.77 చ.గ. స్థలం పూర్తి. హద్దులు: తూర్పు: ప్లాటునెం.142, దక్షిణం: 33అ. వెడల్పు గల రోడ్డు, పడమర: ప్లాటు నెం.144, ఉత్తరం:ప్లాటు నెం.135,

**టైటిల్ హోల్డరు పేరు: పి.భాస్కర్‌నాయుడు**

స్థలం : తిరుపతి
తేది: : 06.05.2026

సం॥ అధీకృత అధికారి, కెనరా బ్యాంక్

# తిరుపతి డివిజన్

# పురాతన సంప్రదాయాలను కాపాడుకోవాలి: ఇఓ,చైర్మెన్



సోమనాధ దేవాలయం సంబరాల్లో పాల్గొన్న ఆలయాధికారులు, పాలకమండలి-ఊరేగింపులో కోలాటాలాడుతున్న ఇఓ వెంకటేశులు

శ్రీకాళహస్తి,మే 11 ప్రభాతవార్త: శ్రీకాళహస్తీశ్వరాలయం సారధ్యంలో సోమవారం సోమనాధ దేవాలయం పునరుద్ధరణ జరిపి 75 సంవత్సరాలు అయిన సందర్భంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలు, పిలుపు మేరకు సంబరాలు జరుపుకున్నారు. ఆలయ ఇఓ బికె వెంకటేశులు సారధ్యంలో ఘనంగా శోభాయాత్రను నిర్వహించారు. ఈ శోభా యాత్రలో సంప్రదాయ కళాకారులతో పాటు ఇఓ కోలాటాడుతూ సోమనాధ్ స్వాభిమాన్ సర్వ్ శోభాయాత్రను సాగించారు. ప్రభుత్వం ఆదేశించిన మేరకు కార్యక్రమాలను నిర్వహించారు. తరువాత రాజగోపురం పక్కన ఏర్పాటు చేసిన సాంస్కృతిక కళావేదికపై సంప్రదాయ కార్యక్రమాలను ఏర్పాటు చేసారు. ఇఓ బికె వెంకటేశులు మాట్లాడుతూ మన సంప్రదాయాలు,సంస్కృతి మహోన్నత మైనదన్నారు. అంతేకాక ఆలయాల పరిరక్షణ మన అందరి బాధ్యత అన్నారు. ఈ మేరకు ఇక్కడ ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో సోమనాధ ఆలయంలోని శివలింగం దృశ్యాన్ని ఏర్పాటు చేసి ఆలయ ప్రధానార్చకులు సంబం ధం గురుకుల్, కరుణాకర్ గురుకుల్స్ పూజలు నిర్వహించారు. వేదపండితులు, ఆలయ పారో హితులు అర్ధగిరి స్వామి వేదమంత్రాలు పఠిస్తుం డగా పూజా కార్యక్రమాలను నిర్వహించారు. చైర్మెన్ కొట్టె సాయిప్రసాద్ మాట్లాడుతూ నేడు మన సంప్రదాయాలకు దిక్సూచిలుగా ఆలయాలు న్నాయన్నారు. వాటి పరిరక్షణలో ప్రధాని నరేంద్రమోదీ చొరవ ఎంత పొగిడినా తక్కువే అన్నారు. ఈ కార్యక్రమాల్లో ఆలయ ఇఓ బికె వెంకటేశులు చైర్మెన్ కొట్టె సాయి ప్రసాద్,డెప్యూటి ఇఓ ఎన్ ఆర్ కృష్ణారెడ్డి ఇఇ శ్రీనివాసరాజు, డిఇఇ శ్రీనివాసులురెడ్డి, కిషోర్,ధర్మకర్తల మండలి సభ్యుడు వాకచర్ల గుర్రప్పశెట్టి, హేమావతి, ఆలయ ఎఇఓలు మోహన్, హేమామాలిని, విజయసారధి, శ్రీహరి, విద్యాసాగర్‌రెడ్డి, నాగభూషణం యాదవ్, రవి,దుర్గాప్రసాద్,బిజెపి నాయకుడు జివి అమర్‌నాథ్ తదితరులు పాల్గొన్నారు.

గాంధీ విగ్రహం వద్ద లైట్లు...

## గాంధీ విగ్రహానికి కళ్ళజోడు



రేణిగుంట మే 11 ప్రభాతవార్త: రేణిగుంట బస్టాండ్ సెంటర్లో ప్రసిద్ధి చెందిన గాంధీజీ విగ్రహ మండపానికి లైటు, గాంధీజీ విగ్రహానికి కళ్ళజోడు సోమవారం టిడిపి శ్రీకాళహస్తి నియోజకవర్గం ముస్లిం మైనార్టీ అధ్యక్షుడు అఫ్రోజ్ ఏర్పాటు చేయించారు.గత కొద్ది నెలలుగా గాంధీజీ విగ్రహం మండపంలో లైటు లేక గాంధీ విగ్రహం చీకట్లో ఉండేది. ఆయన విగ్రహానికి ఉన్న కళ్ళజోడు ఎత్తుకెళ్లడంతో కళ్ళజోడు లేక విగ్రహం వెలవెల పోయింది. ఇది గమనించిన టిడిపి శ్రీకాళహస్తి నియోజకవర్గం మైనార్టీ అధ్యక్షుడు అఫ్రోజ్ స్పందించి గాంధీజీ మండపంలో లైటు, గాంధీజీకి కళ్ళజోడు ఏర్పాటు చేశారు. పలువురు గాంధీయ వాదులు, రేణిగుంట ప్రజలు ఆయనను అభినందించారు.

## పదవ తరగతి టాపర్స్‌కు ఘన సన్మానం



వరదయ్యపాలెం, మే 11 ప్రభాతవార్త: ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య లభిస్తుందని ప్రశాంత్ చికెన్ స్టాల్ అధినేత వై.మునీశ్వర్, వారి కుటుంబ సభ్యులు తెలిపారు. సోమవారం మండలంలోని ఆరు జెడ్పీ ఉన్నత పాఠశాలలకు చెందిన పదవ తరగతి టాపర్స్‌ను ఘనంగా సత్కరించారు. అనుభవం, ఉన్నత విద్యావంతులైన ఉపాధ్యాయులతో ఉన్నత ప్రమాణాలతో నాణ్యమైన విద్య, క్రమశిక్షణ అందించే ప్రభుత్వ పాఠశాలలు కార్పొరేట్ విద్యాసంస్థల కంటే బలోపేతం కావాలన్నదే తన ఆశయం అని ప్రశాంత్ చికెన్ స్టాల్ అధినేత వై. మునీశ్వరయ్య అన్నారు. పదో తరగతి ఫలితాల్లో (దీక్షిత సాయి వరదయ్యపాలెం హైస్కూల్) జిల్లాలోనే అత్యధిక మార్కులతో టాపర్‌గా నిలిచి, జిల్లా స్థాయి, రాష్ట్ర స్థాయిలో వరదయ్యపాలెం మండలానికి గర్వకారణంగా నిలవడమే కాకుండా, ఉత్తమ మార్కులతో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించడంపై మునీశ్వరయ్య, ఆరు హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు హర్షం తెలిపారు. వరదయ్యపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం పదోతరగతి ఫలితాల్లో టాపర్లుగా నిలిచిన విద్యార్థులను మునీశ్వరయ్య దంపతుల ఆధ్వర్యంలో సన్మానం చేసి జ్ఞాపికతో సత్కరించారు. అదే విధంగా ఆరు హైస్కూల్ ప్రధానోపాధ్యాయులను సమీకరించి ఈ కార్యక్రమం నిర్వహణకు కృషి చేసిన వ్యాయామ దర్శకులు బందిల కుమార్‌కు కృతజ్ఞతలు తెలుపుతూ అభినందించారు. అనంతరం ఎంఈవోలు సరస్వతి, గున్నయ్య ఆరు హైస్కూల్ ప్రధానోపాధ్యాయులను కూడా సన్మానించారు. ఇదే స్ఫూర్తిగా వచ్చే ఏడాది ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన ఫలితాలు సాధించేందుకు కృషి చేస్తామని ప్రధానోపాధ్యాయులు రమణయ్య (వరదయ్యపాలెం), మొహిద్దీన్ (గోవర్ధనపురం), ముని సుబ్రహ్మణ్యం (పాండూరు), రవీంద్రారెడ్డి (కారిపాకం), మాధవయ్య, (సంతవేలూరు), జయసుధ (బత్తులవళ్ళం) ప్రతిభ పూనారు. ప్రభుత్వ పాఠశాలలకు చెందిన విద్యార్థులను ప్రోత్సహించేలా చికెన్ స్టాల్ అధినేత మునీశ్వరయ్య సేవదృక్పథం అభినందనీయం అని ప్రధానోపాధ్యాయులు అందరూ కలిసి మునీశ్వరయ్య దంపతులను సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. .

## దివ్యాంగులకు పెన్షన్ రాని వైనం



కేవీబీపురం, మే 11 ప్రభాతవార్త: మండలంలోని పాతపాళెం గ్రామానికి సంబంధించి సురేష్ అనే మధ్యతరగతి కుటుంబానికి చెందిన వ్యక్తి ప్రతిరోజు కూలి పనులకు వెళుతూ తన కుటుంబానికి అండగా జీవనోపాధిని సాగిస్తున్నాడు. ఇతనకు ఇద్దరు పిల్లలు కలిగి ఉన్నారు. యథావిధిగా మండల విద్యుత్ అధికారులకు సహాయకుడిగా వెళుతూ తన జీవనాన్ని గడుపుతూ 2023 డిసెంబరు లోతన స్వగ్రామమైన పాతపాళెం గ్రామంలో విద్యుత్ అధికారుల సమక్షంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు పనులకు వెళ్లి విద్యుత్ సరఫరా ఆపి కరెంటు పనుల నిమిత్తం ట్రాన్స్‌ఫార్మర్‌పైకి ఎక్కడం వలన అనుకోకుండా విద్యుత్ లైన్ ఆన్ చేయడంతో కరెంటు షాక్‌తో ఒక్క సారిగా పై నుంచి కిందకు అపస్మారక స్థితిలో కింద పడ్డాడు. దీంతో సురేష్ ఒక్క సారిగా కోమాలోకి వెళ్లి వెన్నెముక పూర్తిగా దెబ్బతినింది. దీంతో హుటాహుటిన అక్కడ ఉన్న అధికారులు కుటుంబ సభ్యులు వెంటనే ఆస్పత్రికి తరలించారు. వెన్నెముక పూర్తిగా దెబ్బతిందని, రెండు కాళ్లు పడిపోయాయని కేవలం మంచానికి పరిమితమై ఉంటాడని వైద్యులు పేర్కొన్నారు. తన జీవితంలో ఎప్పటికీ ఇంకా నడవలేదని వెన్నెముక పూర్తిగా దెబ్బతిని సుమారు పది లక్షల వైద్య ఖర్చు పెట్టామని, తనకు ఎవరూ సహాయపడలేదని కనీసం ఏ అధికారి తమ చూడడానికి వచ్చిన దాఖలాలు కూడా లేదని కుటుంబ సభ్యులు వాపోయారు. జిల్లా అధికారులు చుట్టూ తిరిగినా కూడా ఫలితం లేకుండా పోయిందని, ప్రభుత్వం కూడా పెన్షన్ ఇస్తే కాని మేం కూడా ఏమీ చేయలేమంటూ అధికారులు సమాధానం చెబుతున్నారని సురేష్ తెలిపారు. ఇకనైనా తిరుపతి జిల్లా ప్రభుత్వ యంత్రాంగం సంబంధించిన అధికారులు పరిశీలనకు వచ్చి తనకు న్యాయం చేయాలని కోరారు.

# నా వల్ల కాదు...నన్ను వదిలేయండి

- చేతులెత్తిసిన కాంట్రాక్టర్



సత్యవేడు-ఊత్తుకోట రోడ్డు మార్గంలో ఆగిన పనులు

సత్యవేడు, మే 11 ప్రభాతవార్త: ఎక్కడ పైసలు వస్తుందో...అక్కడ అన్ని తామై కొందరు అధికారులు, అధికార పార్టీ నేతలు, కార్యకర్తలు దూసుకుపోతున్నారు. అయితే అభివృద్ధి విషయాలపై ఏర్పడ్డ చిన్న చిన్న సమస్యలను పరిష్కరించడానికి వారు ఏ మాత్రం ముందుకు రావడం లేదని చెప్పడానికి ఉదాహరణంగా...సత్యవేడు-ఊత్తుకోట రోడ్డు మార్గంలో ఆగిన పనులు పేర్కొనవచ్చు. ఆగిన పనుల వల్ల ఈ మార్గంలో రాకపోకలు సాగించడం నిత్యం ప్రమాద భరితంగా మారిందని ఇటు వాహన చోదకులు, ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అసలే అధ్వానంగా ఉన్న ఈ రోడ్డు మార్గంలో విచ్చలవిడిగా లక్షలాది టన్నుల్లో టిప్పర్ లారీల్లో ఎర్ర మట్టిని తరలించి మట్టి మాఫియా కోట్లు మింగుతున్నాయి. ఈ మార్గంలో ప్రయాణించేవారు గ్రామస్తులు మట్టి కొట్టుకుపోతున్నారు. ఫలితంగా శ్వాసకోశ ఇబ్బందులు, చర్మవ్యాధులు, దుమ్ము ధూళితో నానా అవస్థలు పడుతున్నా పట్టించుకునే దిక్కు లేదు.

**నా బార్డు నిధులు ఆగిన పనులు:**

సత్యవేడు-ఊత్తుకోట రోడ్డు మార్గం మొత్తం 15 కిలో మీటర్లు. వీటి అభివృద్ధి పనుల కొరకు నా బార్డు కింద 4.05 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసింది. నగరి ప్రాంతానికి చెందిన ఓ కాంట్రాక్టర్ ఈ పనులను టెండర్ల ద్వారా తగ్గించుకోవడం జరిగింది. ఆగ మేగాలపై స్థానికుల అభ్యర్ధన మేరకు నిర్మాణ పనులను రెండు మాసాలకు మునుపు ప్రారంభించారు. స్థానిక వీఎంకే కల్యాణ మండపం నుంచి వెంకట రాజుల కండ్రిగ వరకు రోడ్డును కొంత వెడల్పు చేసి తారు వేసి పనులు అక్కడి వరకు పూర్తి చేయడం జరిగింది. వెంకటరాజుల కండ్రిగ నుంచి ఊత్తుకోట వరకు ఇంకా పనులు చేయాల్సి ఉంది. అంటే 11 కి.మీ రోడ్డు అభివృద్ధి పనులు ఆగిపోయింది. అక్కడక్కడ రోడ్డు బాగా దెబ్బతినడంతో వాటిని బలోపేతం చేయడం కొరకు తవ్వేసి పనులు ఆపేశారు. ఈ రోడ్డు మార్గంలో వాహనాల రాకపోకలు సాగించడం ప్రమాదకరంగా మారింది.

**నన్ను వదిలేయండి:**

ఏమైందో ఏమో ఈ రోడ్డు బలోపేత నిర్మాణ పనులు చేపట్టిన కాంట్రాక్టర్ కనీసం అధికారులకు సమాచారం ఇవ్వకుండానే పనులు ఆపడం జరిగింది. విషయం తెలుసుకున్న అధికారులు సంబంధిత కాంట్రాక్టర్‌ని ప్రశ్నిస్తే నన్ను వదిలేయండి నేను ఈ నిర్మాణం పనులు చేపట్టలేను అని తేల్చేయడం జరిగిందని స్థానికులు అంటున్నారు. ఈ రోడ్డు మార్గంలో ఐదు నిమిషాలకు పది టిప్పర్ లారీలు ఊత్తుకోట వైపుగా మట్టిని తీసుకుపోతున్నాయి. ఈ కారణంగా రోడ్డు బలోపేత పనులకు సమస్య వస్తుందని, నిర్మాణం జరిగిన వెంటనే ఈ భారీ టిప్పర్లు వెళ్లడం వల్ల తరచూ నాణ్యత దెబ్బతింటుందని అందు వల్ల నాకు చెడ్డ పేరు వస్తుంది నన్ను వదిలేయండి అని కాంట్రాక్టర్ చేతులెత్తేశాడని గ్రామస్తులు చెబుతున్నారు. ఇదిలా ఉండగా పనులు చేస్తే అంత సులువుగా బిల్లులు రావడం జరగదని ఆందోళనతోనే పనులు ఆపేశారని మరో వాదన వినిపిస్తోంది. ఈ విషయాలపై స్పందించి చర్యలు తీసుకునే దిక్కు లేదని సమీప వెంకటరాజుల కండ్రిగ, మదనంబేడు, పేరడం, అంబాకం, పుదుకుప్పం, దాసుకుప్పం, చెన్నేరి గ్రామస్తులు వాపోతున్నారు.

## సిఐ ఇబ్రహీం...మానవీయం



శ్రీకాళహస్తిరూరల్,మే 11 ప్రభాతవార్త శ్రీకాళహస్తి రూరల్ సిఐ ఇబ్రహీం దూ గుడ్ జాబ్. మనం పోలీసులే అయినా మాన వీయతను చాటుకోవాలి. శ్రీకాళహస్తి రూరల్ పోలీసు సిఐను ఆదర్శంగా తీసుకోవాలని జిల్లా ఎస్పి సుబ్బరాయుడు ప్రసంశించారు. ఆదివారం రాత్రి గస్తీ తిరుగుతున్న అర్ధరాత్రి వేళ ఇబ్బందుల్లో చిక్కుకొని దిక్కుతోచని స్థితిలో సతమతమౌతున్న పరదేశీయులను గుర్తించి సిఐ ఇబ్రహీం మానవతా దృక్పథంతో వ్యవహారించి జిల్లా అధికారుల ప్రశంసలందుకున్నారు.వివరాలు ఇలా ఉన్నాయి. శ్రీకాళహస్తి రూరల్ సిఐ ఇబ్రహీం రాత్రి గస్తీ తిరుగుతుండగా ఎన్‌హెచ్ 71 జాతీయ రహదారిపై రెండు కార్లు టైర్లు పగిలి రహదారిపై నిలిచి పోయాయి.చిమ్మచీకటి, దారి దొంక తెలియని ప్రాంతం. పసిపిల్లల ఏడ్పులతో ఆ ప్రాంతం గందరగోళంగా మారింది.హైదరాబాదు నుంచి వస్తున్న ఓ కారు మరో కారు రోడ్డుపై నిలిచి ట్రాపిక్‌కు అంతరాయంగా మారింది. ఇక్కడ గస్తీ తిరుగుతున్న సిఐ ఇబ్రహీం మానవీయంతో వ్యవహారించారు. విషయం తెలుసుకున్న సిఐ ఇబ్రహీం తన సిబ్బందితో అక్కడకు చేరుకున్నారు. ప్రయాణీకులను మొదట సురక్షింతంగాసర్వీసు రోడ్డుకు తరలించారు. భయాందోళనకు గురౌతున్న వారిని ఓదార్చారు. అర్ధరాత్రి వేళ పిల్లలు,మహిళలకు మేమున్నామని అందించిన సహాకారంతో ప్రయాణీకులు ఊరట చెంది జిల్లా ఎస్పికి సమాచారం అందించారు. పోలీసుల మానవీయతను ప్రశంసించారు.దాంతో ఎస్పి సుబ్బరాయుడు రాత్రి పెట్రోలింగ్ సమయంలో అప్రమత్తంగా వ్యవహారించి మానవత్వంతో వ్యవహారించి ప్రసంశలందుకున్న సిఐ ఇబ్రహీం,వారి సిబ్బందిని ప్రశంసించారు. ప్రజలు ఇబ్బందుల్లో ఉన్నపుడు స్పందించి ఆదుకోవటం అండగా నిలవటం పోలీసు సేవల అసలు భావమని ఎస్‌సి పేర్కొన్నారు.అత్యవసర పరిస్థితిల్లో ప్రజలు 112కు సమాచారం ఇవ్వాలని కోరారు.

## ఎంఎల్‌ఏ చొరవతో...ఎంపేడు దళిత వాడకు దారి



శ్రీకాళహస్తిరూరల్,మే 11 ప్రభాతవార్త: శ్రీకాళహస్తి మండలం ఎంపేడు దళిత వాడకు శ్మశానానికి దారి కల్పిస్తూ సోమవారం నిర్ణయం తీసుకున్నారు.దాంతో దళిత వాడ వాసులు ఎంఎల్‌ఏ సుధీర్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.ఇటీవల శ్రీకాళహస్తి మండలం ఎంపేడు గ్రామంలో సీనియర్ తెలుగుదేశం నేత తాటిపర్తి ఈశ్వర్‌రెడ్డిని పరామర్శించుటకు ఎంఎల్‌ఏ సుధీర్‌రెడ్డి వచ్చారు.ఈ సందర్బంగా ప్రజలతో మమేకమై పలు సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ నేపథ్యంలో దళితవాడ వాసులకు శ్మశానానికి దారి లేక ఇబ్బంది పడుతున్నట్లు విన్నవించుకున్నారు.ఈ సమస్య పరిష్కారానికి ఎంఎల్‌ఏ గ్రామానికి చెందిన తాటిపర్తి రవీంద్రరెడ్డికి బాధ్యత అప్పగించారు. ఆయన సోమవారం తాటిపర్తి రవీంద్రరెడ్డి చుట్టుపక్కల పొలాల యజమానులతో చర్చించారు. దళిత వాడ వాసులకు శ్మశానికి దారి కల్పించుటకు దారి ఏర్పాటు చేసారు.దాంతో శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి రవీంద్రరెడ్డి చొరవను అభినందిస్తూ ప్రజలు ఎదుర్కొంటున్న మౌళిక సమస్యలను క్షేత్రస్థాయిలోనే ఆ ప్రాంత నాయకులు పరిష్కరించాలని అదే కూటమి లక్ష్యమన్నారు. ఎంపేడు సమస్యను ఇంత త్వరగా పరిష్కరించిన రవీంద్రరెడ్డిని అభినందించారు.

## ఉత్తమ సేవందించిన ఉద్యోగులకు నేడు సన్మానం

శ్రీకాళహస్తి,మే 11 ప్రభాతవార్త: పురపాలకసంఘంలో ఉత్తమ సేవలిందించిన ఉద్యోగులను మంగళవారం శ్రీకాళహస్తి శాసనసభ్యులు బొజ్జల వెంకటసుదీర్‌రెడ్డి సారధ్యంలో సన్మాన కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు మున్సిపల్ కమిషనర్ భవాని ప్రసాద్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని పానగల్‌లోని ఆర్‌జిఆర్ కళ్యాణ మండపంలో సన్మాన కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు వివరించారు. 2025-26 సంవత్సరాలకు సంబంధించి ప్రజలకు ఉత్తమ సేవలందించిన సచివాలయ మరియు కార్యాలయ సిబ్బందికి ఉదయం సన్మాన కార్యక్రమాలు ప్రారంభమౌతాయని వివరించారు. ఈ కార్యక్రమాలకు ముఖ్యఅతిధులుగా శాసనసభ్యులు సుధీర్‌రెడ్డి జిల్లా కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ ఆర్‌డిఓ భాను ప్రకాష్‌రెడ్డి, డివైయస్‌పి నరసింహామూర్తిలు హాజరౌతారని కమిషనర్ భవాని ప్రసాద్ వివరించారు.

## నేడు అగ్రహారంలో జాతర

-ఎంఎల్‌ఏ చే సారె బహూకరణ



శ్రీకాళహస్తి, మే 11 ప్రభాతవార్త: తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలో వేసవి సమయంలో జాతర్లు,పొంగళ్ళు సంబరాలు చోటు చేసుకున్నాయి. ఈ నేపథ్యంలో తిరుపతి తాతయ్యగుంట గంగమ్మ జాతరతో పాటు శ్రీకాళహస్తిలోని అగ్రహారంలో జాతర నిర్వహించటం ఆనవాయితి. ఈ నేపథ్యంలో గత మంగళవారం రాత్రి చాటింపుతో జాతర కార్యక్రమం ప్రారంభమైనది. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి యువకులతో కొత్త కమిటిని నియమించారు. ఈ ఏడాది కూడా జాతరను యువకుల కమిటి సారధ్యంలో నిర్వహిస్తున్నారు. వారం రోజుల నుంచి అగ్రహారం జాతర సన్నాహాల్లో నిర్వహణ కమిటి తలమునకలై ఉన్నారు. మంగళవారం సాయంత్రం గంగమ్మకు ఎంఎల్‌ఏ సుధీర్‌రెడ్డి సారెను అందించనున్నారు.

**పొన్నాలమ్మకు పొంగళ్ళు:**

శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలో వెలసిన గ్రామదేవతగా 'పానగల్‌లోని పొన్నాలమ్మ' ఆలయంలో పొంగళ్ళు సంబరాలు చోటు చేసుకున్నాయి.పొన్నాలమ్మ ఆలయం చుట్టుపక్కల ఏడు గ్రామాలకు ఈ ఆలయం వేదికగా ఉంది. పానగల్, అగ్రహారంలలో జాతర సందర్బంగా ఇక్కడ పొంగళ్ళు నిర్వహించటం ఆనవాయితి. ఈ ఆలయ నిర్వాహకులు పొంగళ్ళు నిర్వహించుటకు చక్కటి ఏర్పాట్లు చేసారు.

**నేడు సారె బహూకరణ:**

శ్రీకాళహస్తి శాసనసభ్యుడు బొజ్జల సుధీర్‌రెడ్డి మంగళవారం సారధ్యంలో గంగమ్మకు సారె అందించుటకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ ఏడాది యువకులు సుమారు రూ.5లక్షల బడ్జెట్‌తో గంగమ్మ జాతరను నిర్వహించుటకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ మేరకు యువకులు భారీ ఎత్తున సన్నాహాలు చేస్తున్నారు.ఇందుకు పోలీసులు బారీ బందోబస్తును ఏర్పాటు చేస్తున్నారు.

## ఈ రెవెన్యూ సమస్యలు తీరేదెన్నటికి?

ఏర్పేడు,మే 11 ప్రభాతవార్త: శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని మండలాల్లో రెవెన్యూ సమస్యలు రాజ్యమేలుతున్నాయి. సోమవారం ఏర్పేడు మండల కేంద్రంలో ఎంపిడిఓ సౌభాగ్యం అధ్యక్షతన ప్రజా సమస్యల పరిష్కార వేదికగా సమావేశం నిర్వహించారు.అయితే ఎక్కడ సమస్యల పరిష్కారానికి సమావేశాలు నిర్వహించినా భూ సమస్యలే అందుతున్నాయి.ఈ సమావేశంలో ఎంపిడిఓతో పాటు తహశీల్దార్ రాజశేఖర్,పార్టీ అధ్యక్షుడు నాగరాజునాయుడు తదితరులు పాల్గొన్నారు.అధికంగా రెవెన్యూ, భూ సమస్యలు దరఖాస్తులు అందాయి.ఈ కార్యక్రమాల్లో విఆర్‌ఓలు,పంచాయతీకార్యదర్శులు నాయకులు కేశినేని సుబ్రమణ్యం, తేజ, గోపాల్, రాచేటి సుబ్రమణ్యం, తదితరులు పాల్గొన్నారు.

## కూటమి సూపర్ సిక్స్ పథకాలు సూపర్ హిట్

-తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఎం సుబ్బయ్య

శ్రీకాళహస్తి మే 11 ప్రభాతవార్త : కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సూపర్ సిక్స్ పథకాలు సూపర్ హిట్ అని తెలుగుదేశం నాయకులు అన్నారు. సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం నాయకులు ప్రకటించి అమలు చేస్తున్న పథకాల అమలులో రాజీలేని విధంగా వ్యవహరిస్తూ ప్రజా మన్ననలను అందుకుంటున్నా రని వివరించారు. 2024లో ఎన్నికల సమయంలో బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారంటీ సూపర్ సిక్స్ పథకాలు సూపర్ హిట్‌గా రాష్ట్ర,దేశ రాజకీయాల్లోనే ప్రథమ స్థానంలో నిలిచిందని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఎం సుబ్బయ్య అన్నారు. ఈ రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ ఎన్డీఏ కూటమి ద్వారా ప్రజలకు సంక్షేమ పథకాలు బ్రహ్మాండంగా అందజేయడం జరిగిందన్నారు.

## మాజీ ఎమ్మెల్యేచే ఆదెమ్మకు నివాళి

తొట్టంబేడు, మే 11 ప్రభాతవార్త: శ్రీకాళహస్తి నియోజకవర్గం, తొట్టంబేడు మండలం,బోనుపల్లి గ్రామానికి చెందిన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్త ఆనంద్ వాళ్ళ తల్లి జలగం ఆదెమ్మ ఆకస్మిక మృతి చెందారు. సోమవారం మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి వారి పార్థీవదేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో ఉమ్మడి చిత్తూరు జిల్లా ప్రధాన కార్యదర్శి ఉన్నం వాసుదేవ నాయుడు,కోవి చంద్రయ్య నాయుడు, గంగాధరం, శ్రీవారి సురేష్, షేక్ బాబు తదితరులు ఉన్నారు.

## తెలుగుభాష పై మక్కువ పెరగాలి

-గ్రంథాలయ చైర్మెన్ రెడ్డివారి గురువారెడ్డి



తొట్టంబేడు, మే 11 ప్రభాతవార్త: రాష్ట్ర ప్రభుత్వం తెలుగుభాష పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని ఈ నేపథ్యంలోనే గ్రంధాలయ సంస్థ ద్వారా తెలుగు భాషపై మక్కువ పెరిగేటట్లు శిక్షణా శిబిరాలను నిర్వహించుటకు ఆదేశించిందని జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మెన్ రెడ్డివారి గురువారెడ్డి అన్నారు. సోమవారం ప్రథమ శ్రేణి శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న శిక్షణ తరగతులను ఆకస్మికంగా తనిఖీ చేసారు. ఈ శిక్షణా తరగతులలో ఏమేమి నేర్చుకున్నారు అని ప్రతి విద్యార్థిని అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా తెలుగు పద్యాలు, గేయాలు వారి ద్వారా తెలుసుకున్నారు. ఈ సందర్భంగా తెయన మాట్లాడుతూ ఈ వేసవి విజ్ఞాన శిబిరాలు ముఖ్యమంత్రి నాయకత్వంలో విద్యాశాఖ మంత్రి లోకేష్ సారధ్యంలో కూటమి ప్రభుత్వం నిర్వహిస్తుంద న్నారు. అదేవిధంగా విద్యార్థి ఉమేష్ పేపర్ క్రాఫ్ట్ ద్వార చేసిన హారముతో చైర్మెన్ సత్కరించిన్నారు. ఈ సందర్భంగా పిల్లలను చైర్మన్ అభినందించారు.ఈ కార్యక్రమములో గ్రంథాలయ అధికారి ఎ హరిక్రిష్ణ ఉపాధ్యాయులు షణ్ముగం, మునిసుబ్బారెడ్డి, యుగంధర్, మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.

## నూతన కార్యవర్గ నియామక పత్రాలు అందజేత



తొట్టంబేడు, మే 11 ప్రభాతవార్త: శ్రీకాళహస్తి పట్టణంలో బీసీ జాతీయ సంక్షేమ సంఘం అధ్యక్షులు రమణ సారధ్యంలో ఆర్ కృష్ణయ్య ఆదేశాల మేరకు నూతన వర్గ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తిరుపతి జిల్లా అధ్యక్షులు సురేందర్ రెడ్డి హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ జాతీయ నాయకుడు ఆర్.కృష్ణయ్య బీసీ కుటుంబాలకు ఎన్నో సేవా కార్యక్ర మాలు నిర్వహించి బీసీలకి న్యాయం జరిగేలాగా పోరాటాలు చేశామన్నారు. శ్రీకాళహస్తి నియోజకవర్గ బీసీ సంక్షేమ నియమ పత్రాలు తిరుపతి జిల్లా అధ్యక్షులు నియోజకవర్గ ఇన్చార్జ్ చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గం మీడియా కోఆర్డినేటర్ సంజాకుల బాల సుబ్రమణ్యం, పట్టణ అధ్యక్షులు జై కృష్ణ, వైస్ శంకర్ గౌడ్ బీసీ సంక్షేమ నేతలు పాల్గొన్నారు.

## కార్మికులకు ఇంటి స్థలాలు ఇవ్వాలి : సిపిఐ

తొట్టంబేడు, మే 11 ప్రభాతవార్త : శ్రీకాళహస్తి నియోజకవర్గం తొట్టంబేడు మండలం ఈదులగుంట ఎల్‌ఐసి కాలనీ, ఇళ్లలో పనిచేసుకుంటూ జీవనం గడుపుతున్న నిరుపేద కార్మికులకు ఇంటి స్థలాలు ఇవ్వాలని సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో సిపిఐ డిమాండ్‌చేసింది. తహసిల్దార్ భారతికి వినతి పత్రం అందించారు. ఈ మేరకు సిపిఐ నాయకులు శివకుమార్ మాట్లాడుతూ ఈదులగుంట ఎల్‌ఐసి కాలనీలలో గత 25 సంవత్సరాలుగా అద్దె ఇళ్లలో కాపురం ఉన్నటువంటి కార్మికులు సుమారు 40 మంది పైగా ఉన్నారని, కార్మికులు ఇండ్లలో పాచి పని చేస్తున్నారని వారు పనికి వెళితేగాని పూట గడవదని ఎన్నో ఏళ్లుగా ఇంటి స్థలాలు మూడు సెంట్లు ఇవ్వాలన్నారు. కార్యాలయాలు అధికారులు చుట్టూ ప్రదక్షణ చేసి కాళ్లు అరిగేలా తిరుగుతున్న పట్టించుకునే పాపాన పోలేదని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షులు చారులత, ధనలక్ష్మి, సుబ్బమ్మ,అంకయ్య, పరశురామయ్య, బత్తమ్మ,కృపమ్మ,మహేష్,కృష్ణయ్య, కుసుమ, అంకయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఆశ్రమంచే ఉచిత యోగ శిక్షణ తరగతులు



శ్రీకాళహస్తి, మే 11 ప్రభాతవార్త: మానవ జీవన ప్రమాణంలో యోగ ఒక ముఖ్యమైన పాత్ర పోషిస్తుందని తిరుపతి జిల్లా బిజెపి మాజీ అధ్యక్షులు యోగా గురువు డాక్టర్ చంద్రప్ప అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీకాళహస్తి శుకబ్రహ్మాశమం నందు శ్రీ విద్యా స్వరూపానంద గిరి స్వామి వారి ఆశీస్సులతో గత కొద్ది సంవత్సరంల నుండి ఉచిత యోగా శిక్షణ తరగతులు నిర్వహించబడుతున్నాయని, అందులో భాగంగా ఈ సంవత్సరం వేసవి సెలవులలో విద్యార్థినీ,విద్యార్థులకు పది రోజులుగా ఉచిత యోగా శిక్షణ నిర్వహించబడతాయన్నారు. పిల్లలకు మరిన్ని మంచి సందేశాలను ఇచ్చేందుకు ఆశ్రమ గురువులతో పాటు వక్తగా విచ్చేశారు.పిల్లలు వారి జీవితంలో ఎలా మెలగాలి ప్రతిరోజుయోగ శిక్షణ చేయగలిగే విద్యార్థులలో జ్ఞాపకశక్తి, మనోధైర్యం, ఏకాగ్రత, వారి వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందిస్తుందని, తల్లితండ్రుల పట్ల గౌరవం భక్తి భావం కలిగి ఉండాలని పిల్లలకు తెలియజేశారు. అనంతరం యోగ సాధకులు చంద్రప్పను పూలమాలతో సన్మానించి ధన్యవాదములు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో యోగాచార్యులు మార్కండేయులు, భాస్కర్, బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ సుధాకర్ , గరికపాటి రమేష్ బాబు పిల్లలు తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## విధి నిర్వహణలో వ్యక్తి మృతి!

తొట్టంబేడు, మే 11 ప్రభాతవార్త: విధి నిర్వహణలో భాగంగా ఓ వ్యక్తి ప్రాణాలు గాలిలో కలిసిపోయిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. తొట్టంబేడు ఎస్సై బి బాలకృష్ణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఆదివారం రాత్రి నెల్లూరు ప్రాంతానికి చెందిన పి.ముక్తార్ కుమారుడు పి.హషూబ్ (25) శ్రీకాళహస్తి- సూళ్లూరుపేట ప్రాంతంలో డైరీ డే సంస్థలో సేల్స్ మార్కెటింగ్ ఉద్యోగిగా పని చేస్తున్నాడు. విధుల నిమిత్తం శ్రీకాళహస్తిలో మూడు రోజులు, సూళ్లూరుపేటలో మూడు రోజులు పనిచేస్తూ సూళ్లూరుపేటలో పీజీ హాస్టల్‌లో నివసిస్తున్నాడు. ఇందులో భాగంగా శ్రీకాళహస్తి నుండి తడా వైపు మోటార్ సైకిల్‌పై వెళ్తుండగా, తొట్టంబేడు మండలం బీడీ కాలనీ మలుపు వద్ద అతివేగంగా,అజాగ్రత్తగా వాహనం నడపడం వలన అదుపు తప్పి రోడ్డుకు ఎడమవైపు ఉన్న గట్టును ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో అతనికి తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే అతని చరవాణి సహాయంతో సులూరుపేట లోని తన మిత్రులకు సమాచారం అందజేశారు. వారు హుటాహుటిన శ్రీకాళహస్తి ఏరియా హాస్పిటల్ కు తరలించగా, మెరుగైన చికిత్స నిమిత్తం తిరుపతికి రిఫర్ చేశారు. అయితే మార్గమధ్యలో మరణించినాడు. అనంతరం మృతదేహాన్ని తిరిగి శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రిలో భద్రపరిచి మృతదేహాన్ని వారి తల్లిదండ్రులకు సోమవారం అందజేశారు.

## పదోన్నతి పొందిన సింగ్‌కు అభినందనలు



తిరుపతి విద్య, మే 11 ప్రభాతవార్త : బి. మనోజ్ కుమార్ సింగ్ ఉద్యోగ రీత్యా సీనియర్ మెకానిక్ హోదా నుంచి ఫోర్‌మన్‌గా పదోన్నతి పొందిన సందర్భంగా అసోసియేషన్ ఆధ్వర్యం లో ఘనంగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు. అసోసియేషన్ ప్రతినిధులు ఆయనకు దుశ్శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు గుర్రంకొండ శ్రీధర్, కార్యదర్శి ఎన్. సుబ్రహ్మణ్యం, కార్యవర్గ సభ్యులు, పలువురు పాల్గొన్నారు.

## టోయింగ్ ఫుడ్ యాప్ పరిచయ కార్యక్రమం

తిరుపతి విద్య,మే 11 ప్రభాతవార్త: అందుబాటు ధరల్లో ఆహారం అందించే ఫుడ్ డెలివరీ యాప్ టోయింగ్ ఆధ్వర్యంలో తిరుపతిలోని ఓ ప్రైవేట్ కాలేజీలో ప్రత్యేక పరిచయ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా విద్యార్థులకు యాప్ సేవలు, ప్రత్యేక ఆఫర్లు,తక్కువ ధరల్లో ఆహారం అందించే విధానం గురించి వివరించారు.రెస్టారెంట్ మెనూ ధరలకు సమానంగా లేదా అంతకంటే తక్కువ ధరలకు ఆహార పదార్థాలు అందించడం టోయింగ్ ప్రత్యేకతగా నిర్వాహకులు తెలిపారు.అలాగే ఆర్డర్లపై ప్యాకేజింగ్ ఛార్జీలు, ప్లాట్‌ఫామ్ ఫీజులు లేకుండా సేవలు అందిస్తున్నామని పేర్కొన్నారు.ఈ సందర్భంగా టోయింగ్ ఛీఫ్ బిజినెస్ ఆఫీసర్ సిద్ధార్థ్ భాకూ మాట్లాడుతూ,తక్కువ ధరల్లో నాణ్యమైన ఆహారం అందించడమే తమ లక్ష్యమని, ముఖ్యంగా యువత , కాలేజ్ విద్యార్థులను దృష్టిలో పెట్టుకొని సేవలను విస్తరిస్తున్నామని చెప్పారు.కార్యక్రమంలో కాలేజీ యాజమాన్యం, అధ్యాపకులు, విద్యార్థులు మరియు టోయింగ్ ప్రతినిధులు పాల్గొన్నారు.